


# మనసులో మాట

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ : హైదరాబాద్ - పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర - సంపుటి : 1 - సంచిక : 273 - గురువారం - 4 జూన్ 2026 - ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు - పేజీలు : 8+16 - వెల రూ. 7/-

ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ



4

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

సుప్రీంకోర్టు ధర్మాసనం



## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

- విదేశీయుల సహా 21 మంది మృతి
- మాల్వీయానగర్ హోటల్‌లో బీభత్సం
- 40 మందికి పైగా రక్షణ..
- పలువురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు పరిహారం : మోదీ

4

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుని 21 మంది మృతి చెందారు. మా ఓల్వీయా నగర్‌లోని హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఈ విషాదం సంభవించింది. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## తెలంగాణ, థురింగియా మధ్య

# ఒప్పందం

టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్ రంగాల్లో

### పరస్పర సహకారం



## జర్మనీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- సెమీ కండక్టర్స్ రంగంలో పెట్టుబడులపై కీలక చర్చలు
- ఏఐ రాకతో కొత్త అవకాశాలు!
- ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఎంఓయూ
- జర్మనీ అవసరాలకు తగ్గట్లు మన యువతకు శిక్షణ

ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో శరవేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, ముఖ్యంగా ఏ ఐ సృష్టిస్తున్న సరికొత్త అవకాశాలను పూర్తిగా అందిపుచ్చుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జర్మనీ లాంటి అభివృద్ధి చెందిన దేశాల అవసరాలకు తగ్గట్లు తెలంగాణ యువతను అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలతో తీర్చిదిద్దే లక్ష్యంగా.. థురింగియా రాష్ట్రంతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, థురింగియా సీ ఎం మారియో వోయిట్ నేతృత్వంలో జరిగిన ఈ కీలక భేటీ.. రెండు రాష్ట్రాల మధ్య నైపుణ్యాభివృద్ధికి, పరస్పర సహకారానికి గట్టి పునాది వేసింది. యువతకు ఆధునిక శిక్షణ, టెక్నాలజీ బదిలీ, స్టార్టప్ ల ప్రోత్సాహంతో పాటు సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో భారీ పెట్టుబడులతో జర్మన్ కంపెనీల రాకకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేసింది. విదేశీ ప్రతినిధులు సైతం తెలంగాణ ప్రభుత్వ విజన్ ను ప్రశంసించడంతో.. రాష్ట్ర ప్రతిష్ట గ్లోబల్ స్థాయిలో మరింత పెరిగిందనే చర్చ జరుగుతోంది. వివరాలు 3లో..



భూమి పుత్రుల

# జాగీరే

## ఇంటికొస్తే బిర్యానీ పెడతాం!

### సచివాలయంలో వేలు పెడితే ఊరుకోం

### ఆవిర్భావం నాడు పవన్ సభ పెడితే ఎలా?

### 11 రోజులు అన్నం తినలేదన్నది వాస్తవం కాదా..

### పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ ఘాటు కౌంటర్

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్నలా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం తప్ప, తెలంగాణ సచివాలయంలో వేలు పెడతామంటే ఊరుకోబోమని ఘాటుగా హెచ్చరించారు. ప్రాంతీయవాదం పేరుతో తెలంగాణపై పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఇదే సమయంలో తెలంగాణ పాలిట నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీనే అంటూ అధికార పార్టీపైనా విరుచుకుపడ్డారు.

## జూన్ 5 నుంచి కొత్త ధరలు!

- రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో పెరిగిన రేట్లు
- పారదర్శకత కోసమే ఈ సవరణలన్న మంత్రి పొంగులేటి



3

రాష్ట్రవ్యాప్తంగా భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నెల ఐదు నుంచే కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. రిజిస్ట్రేషన్లలో పారదర్శకత కోసమే ఈ విలువల సవరణ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## బయో టెక్నాలజీలో గ్లోబల్ లీడర్

- అత్యాధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్
- కొత్తగా 1500 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి
- థెరానిమ్ బయోలాజిక్స్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హామీ

...వివరాలు 2 పేజీ

## వచ్చే ఏడాది పాదయాత్ర!

- కడుపులో కత్తులు పెట్టుకోలేను!
- నవ్వుతూ అబద్ధాలు చెప్పడం రాదు
- కరోనా కంటే కాంగ్రెస్ పార్టీనే డేంజర్
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కేటీఆర్

...వివరాలు 2 పేజీ

### SENSEX - సెన్సెక్స్

సెన్సెక్స్: 74,346

నిఫ్టీ 50: 23,405



### 150, 200 ఎంఎల్ బాటిళ్లు

కొత్త పరిమాణాల్లో మద్యం సీసాల అమ్మకాలు



2

## ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్!

- ఇకపై ఏటా రెండుసార్లు..
- తాజా ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు
- మిశ్రమంగా స్పందించిన ఉపాధ్యాయ సంఘాలు



2



ఆదాయానికి మించి ఆస్తుల కేసులో

## భుజంగరావు అరెస్ట్

- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో దాడులు
- బయటపడిన రూ. 5.92 కోట్ల అక్రమాస్తులు
- కటకటాల పాలైన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు

2

## భలే మాట!




చంద్రబాబు: నీది గొడ్డలి పార్టీ కల్చర్?.. జగన్: నీది గన్ కల్చర్

పౌరుడు: మాకు ప్రశాంతమైన కల్చర్ కావాలి!

# 150, 200 ఎంఎల్ బాటిళ్లు

**కొత్త పరిమాణాల్లో మద్యం సీసాల అమ్మకాలు**

**పాత నిబంధనలను సవరించిన ఎక్సైజ్ శాఖ**

**ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టత**

**హైదరాబాద్, జూన్ 03 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90 ఎంఎల్, 180 ఎంఎల్, 375 ఎంఎల్, 750 ఎంఎల్ పరిమాణాల్లో మాత్రమే మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150 ఎంఎల్, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా మార్కెట్లోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# ఆదాయానికి మించి ఆస్తుల కేసులో భుజంగరావు అరెస్ట్

**ఏకకాలంలో 15 ప్రాంతాల్లో దాడులు**

**బయటపడిన రూ. 5.92 కోట్ల అక్రమాస్తులు**

**కటకటాల పాలైన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు**




**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టై జ్యుడీషియల్ రిమాండ్ కు వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్న మాజీ అదనపు ఎస్ పీ భుజంగరావు ఇంట్లో ఏ సీ బీ సోదాలు కలకలం రేపాయి. పోలీసు శాఖలో పనిచేసిన సమయంలో ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగాల నేపథ్యంలో ఏ సీ బీ అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్, సూర్యాపేట తదితర పదిహేను ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల అనంతరం భుజంగరావును ఏ సీ బీ అధికారులు అధికారికంగా అరెస్టు చేశారు.

**రూ. 5.92 కోట్ల సొత్తు గుర్తింపు..**

ఈ దాడుల్లో ఏ సీ బీ అధికారులు మొత్తం రూ. 5.92 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. సూర్యాపేటలో 27 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు తేల్చారు. వీటితో పాటు ఐదు ఇంటి స్థలాలు, రెండు ఇళ్లు, హైదరాబాద్ లో ఒక కమర్షియల్ భవనాన్ని గుర్తించారు. సోదాల్లో కిలో బంగారు నగలు లభించాయి. ఆయన బ్యాంకు ఖాతాల్లో రూ. 3.83 లక్షల నగదు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. సోదాల సమయంలో అధికారులకు భారీగా మద్యం సీసాలు కూడా లభించాయి. మొత్తం 29 మద్యం సీసాలను ఏ సీ బీ అధికారులు గుర్తించారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం వారు వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం వరకు ఈ సోదాలు కొనసాగాయి.

# ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్!

**ఇకపై ఏటా రెండుసార్లు..**

**తాజా ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు**

**మిశ్రమంగా స్పందించిన ఉపాధ్యాయ సంఘాలు**



**హైదరాబాద్, జూన్ 03 (మనసులో మాట):** తెలంగాణలో సర్వీస్ లో ఉన్న టీచర్లకు గుడ్ న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్ లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్ లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్ ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్ సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీ ఎస్ యూ టీ ఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. అయితే ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీ ఎస్ యూ టీ ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణ.. భూమి పుత్రుల జాగీరే

- ఇంటికొస్తే బిర్యానీ పెడతాం!
- సచివాలయంలో వేలు పెడితే ఊరుకోం
- ఆవిర్భావం నాడు పవన్ సభ పెడితే ఎలా?
- 11 రోజులు అన్నం తినలేదన్నది వాస్తవం కాదా..
- పవన్ కళ్యాణ్ కు కేటీఆర్ ఘాటు కౌంటర్




**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** తెలంగాణ కచ్చితంగా ఇక్కడ భూమి పుత్రుల జాగీరే అని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ స్పష్టం చేశారు. ఏ పీ డిప్యూటీ సీ ఎం గా పవన్ ను గౌరవిస్తామని, సోదరుడిగా ఇంటికి వస్తే హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ, తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏ పీ డిప్యూటీ సీ ఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు కే టీ ఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కే టీ ఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు.

**ఉల్టాపుల్టా మాటలెందుకు?**

పవన్ తెలంగాణలో పోటీ చేయండి, ఎవరు వద్దంటున్నారు. ఇక్కడికి వచ్చి అన్యాయంగా మాట్లాడటం సరికాదు అని ఆయన సూచించారు. నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది అని ఆయన గుర్తు చేశారు. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని పవన్ అంటున్నారని, తెలంగాణపై ఉల్టాపుల్టా మాటలెందుకని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా అని అన్నారు. పవన్ మీటింగ్ ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని, వేరే ఎవరూ అవసరం లేదన్నారు.

**అది కూడా ప్రాంతీయవాదమేనా?**

పవన్ కళ్యాణ్ మీరు ఇక్కడికి రండి, మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయని కే టీ ఆర్ పేర్కొన్నారు. ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నామన్నారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారని, మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారని, అది కూడా ప్రాంతీయవాదమే అంటారా అని ప్రశ్నించారు. మోదీ తన ప్రాంతీయవాదంతో తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారని ఆరోపించారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక ప్రాంతీయవాదం చేయడం సరైనదేనా అని, దీనికి పవన్ కళ్యాణ్ సమాధానం చెప్తారా అని కే టీ ఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు.

**తెలంగాణకు కాంగ్రెస్సే విలన్!**

ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని కే టీ ఆర్ హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కూడా కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని, తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు.

**అభివృద్ధిలో నెంబర్ వన్..**

కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. కాంగ్రెస్, బీ జే పీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కే టీ ఆర్ పేర్కొన్నారు.

# వచ్చే ఏడాది పాదయాత్ర!

- కడుపులో కత్తులు పెట్టుకోలేను!
- నవ్వుతూ అబద్ధాలు చెప్పడం రాదు
- కరోనా కంటే కాంగ్రెస్ పార్టీనే డేంజర్
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** వచ్చే ఏడాది కచ్చితంగా పాదయాత్ర చేస్తానని, కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేనని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ ఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని, 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్ లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

**తెలివితేటలు లేవు..**

కడుపులో కత్తులు పెట్టుకుని, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని కే టీ ఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా, దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. తనకు అహంకారమని ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని మ్యానుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్స్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని, కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని తాను మాట్లాడలేనని చెప్పారు. తెలంగాణ వాడిని కదా, కడుపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు.

**ఆర్థిక విప్లవం తెచ్చాం..**

రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీ ఆర్ ఎస్ ప్రభుత్వం అని కే టీ ఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్ వన్ గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు.

**చర్చకు సిద్ధం..**

తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని కే టీ ఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీ ఆర్ ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ. 2.8 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీ ఆర్ ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కే టీ ఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ. 29 వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని, నెలకు రూ. 6 వేల కోట్ల అప్పు తీరుస్తున్నామనేది అబద్ధమని, కేవలం రూ. 2 వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీ ఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

# డిస్కంలను ముక్కలు చేసే కుట్ర!

- కాంగ్రెస్ కొత్త విధానం వెనుక వేల కోట్ల స్కాం
- బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే వేముల సంచలన ఆరోపణలు
- ప్రభుత్వ ఆస్తులు కాంగ్రెస్ సొంతానికి వాడుకుంటున్నారని మండిపాటు

**నిజామాబాద్, జూన్ 3 (మనసులో మాట):** విద్యుత్ డిస్కంలను మూడు ముక్కలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న కొత్త విధానం వెనుక వేల కోట్ల కుంభకోణం దాగి ఉందని బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిగిన బీ ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, సర్ అవగాహన, బీ ఆర్ ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలు, కమర్షియల్, గృహ అవసరాలకు సంబంధించి ఆదాయం వచ్చే డిస్కంలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకం వేసిందని ఆరోపించారు. ఆదాయం లేని, బిల్లులు రాని రైతు వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లను కలిపి 'రైతు డిస్కం'గా మారుస్తున్నారని తెలిపారు. గతంలో కమర్షియల్, ఇండస్ట్రియల్ విభాగాల నుండి వచ్చే ఆదాయంలో నుంచి ఏటా రూ. 10 వేల కోట్లు ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం వాడేవారమని, ఇప్పుడు లాభాలు వచ్చేవి ప్రైవేటుకు ఇచ్చి కరెంట్ డిపార్ట్మెంట్ పై ఉన్న రూ. 35,000 కోట్ల బాకీని రైతు డిస్కంపై నెడుతున్నారని వేముల మండిపడ్డారు. దీనివల్ల భవిష్యత్తులో రైతులకు ఉచిత కరెంట్ అందకుండా చేసి, వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ వేల కోట్ల కుంభకోణాన్ని ప్రజలందరికీ వివరించి కాంగ్రెస్ గుట్టు రట్టు చేయాలని బీ ఆర్ ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.



**ఆస్తులన్నీ సొంతానికే..**

నిజామాబాద్ నగరంలో గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని కాంగ్రెస్, బీ జే పీ పార్టీలు నాశనం చేస్తున్నాయని వేముల ధ్వజమెత్తారు. ప్రజల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ పార్టీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్ టీ సీ చైర్మన్ గా ఉన్న సమయంలో నిజామాబాద్ జిల్లా ప్రజల అవసరాల కోసం మెయిన్ రోడ్డుపై, రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ ఎస్ ఈ ఆఫీస్ స్థలాన్ని కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎంపిక చేశామని గుర్తుచేశారు. ఆనాడు ఆర్ టీ సీ బోర్డు మీటింగ్ లో రూ. 20 కోట్ల నిధులతో అత్యాధునిక బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు కూడా ఆమోదించారని తెలిపారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, కోట్ల రూపాయల విలువైన ఆ బస్టాండ్ స్థలాన్ని ప్రజల అవసరాలకు కాకుండా, వారి సొంత కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కోసం, కమర్షియల్ కాంప్లెక్స్ (షాపింగ్ మాల్స్) నిర్మించి కిరాయిల ద్వారా డబ్బులు సంపాదించుకోవడానికి కేటాయించుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడే పవన్ కళ్యాణ్ ఇక్కడ సభలు పెడతా అనడంపై వేముల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బాధపడి పదకొండు రోజులు అన్నం తినని పవన్ కళ్యాణ్ ఇవాళ మన గడ్డపైకొచ్చి పునర్నిర్మాణం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి వీ జీ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, నియోజకవర్గ ఇన్చార్జి రవీందర్ సింగ్, మాజీ మేయర్ నీతు కిరణ్, నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్ ఠాకూర్, నవీద్ ఇక్బాల్ తో పాటు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ, థురింగియా మధ్య ఒప్పందం!

- టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్ రంగాల్లో పరస్పర సహకారం
- జర్మనీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో సీ ఎం రేవంత్ రెడ్డి భేటీ
- సెమీ కండక్టర్స్ రంగంలో పెట్టుబడులపై కీలక చర్చలు
- ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రెండు రాష్ట్రాల ఎంఓయూ
- జర్మనీ అవసరాలకు తగ్గట్లు మన యువతకు శిక్షణ



**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** తెలంగాణ, జర్మనీలోని థురింగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ థురింగియా రాష్ట్ర సీ ఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్ లో సీ ఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐ టీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ ఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా ఏ ఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏ టీ సీ లు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు థురింగియా సహకారం కావాలని కోరారు.

### యువతకు శిక్షణ..

సీ ఎం రేవంత్ వ్యాఖ్యలకు స్పందించిన థురింగియా సీ ఎం మారియో వోయిట్.. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టామ్ కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, థురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుంది. సీ ఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సెమీ కండక్టర్స్ రంగంలో పెట్టుబడులు..

థురింగియా సీ ఎం మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి శ్రీధర్ బాబు స్వాగతిస్తూ.. ఇప్పటికే హైదరాబాద్ లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు.

### తెలంగాణ రైజింగ్ పై ప్రశంసలు..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో థురింగియా సీ ఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీ ఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్ పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత, జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని, ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# జూన్ 5 నుంచి కొత్త ధరలు!

- రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ పరిధిలో పెరిగిన రేట్లు
- పారదర్శకత కోసమే ఈ సవరణలన్న మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, జూన్ 03 (మనసులో మాట):** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు అధికారికంగా ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల ఐదవ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

### క్షేత్రస్థాయి అధ్యయనం..

రాష్ట్రంలోని నూట నలభై నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై విస్తృత సమీక్ష జరిపారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో శాస్త్రీయంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓ ఆర్ ఆర్), రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ ఆర్), కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, అభివృద్ధి కారిడార్ల ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం లెక్కలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయా చోట్ల మార్కెట్ విలువలను సవరించింది.

### ఫ్లాట్ల ధరల్లో హేతుబద్ధీకరణ..

ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫ్లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉండేలా నిర్ణయించారు. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట ఎలాంటి పెంపు ప్రతిపాదనలు లేవు. అలాగే హెచ్ ఎం డీ ఏ, కుడా, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను ఖరారు చేశారు. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను నిర్ణయించడంతో పాటు, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించారు. రెండు వేల ఇరవై ఒకటి తర్వాత నిర్మాణ వ్యయాలు మారడంతో ఆర్ సీ సీ, నాన్ ఆర్ సీ సీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేశారు.

### లక్ష్యం పారదర్శకతే..

భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ధారించడమే ఈ సవరణల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతోనే ఈ సవరణలు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# బయో టెక్నాలజీలో గ్లోబల్ లీడర్!

- అత్యాధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్
- రూ.1200 కోట్లతో థెరానిమ్ బయోలాజిక్స్ ప్లాంట్ ప్రారంభం
- కొత్తగా 1500 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి
- థెరానిమ్ బయోలాజిక్స్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని హామీ

**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో రూ. 1200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మా రాజధాని హైదరాబాద్ ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్ డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయన్నారు.

### మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్..

సాంకేతిక మార్పుల ఫలితంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా, తలెత్తే సవాళ్లను అధిగమించేలా, దిగ్గజ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్ తదితర విప్లవాత్మక అడుగులు లైఫ్ సైన్సెస్ రంగంలో మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడతాయన్నారు. ఓ వైపు లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే, మరోవైపు వారికి కావాల్సిన రెడీ టూ వర్క్ ఫోర్స్ ను తయారు చేసే బృహత్తర బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ ఫార్మా కంపెనీలకు మంత్రి పిలుపునిచ్చారు.




తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ గా మార్చే ప్రయాణంలో థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ మరొక కీలక మైలురాయి అని, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల కిత్సకు సంబంధించిన ఔషధాలను ఇక్కడ ఉత్పత్తి చేసి యూఎస్ తో పాటు పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు వివరించారు. ఈ ప్లాంట్ ద్వారా కొత్తగా సుమారు 1500 మందికి పైగా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కంపెనీ ప్రతినిధులు కె. నిత్యానంద రెడ్డి, డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, డాక్టర్ శాతకర్ణి ఎమ్., డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు, సనత్ ఛట్టోపాధ్యాయ, దేవ్ మరాల్డో తదితరులు పాల్గొన్నారు.



# వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్!

**దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలేతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ**

**'తెలంగాణ రైజింగ్ ప్రపంచ సదస్సు'కు రావాలని ఆహ్వానం**

**ఇరు దేశాల మధ్య పెట్టుబడుల విస్తరణపై కీలక చర్చలు**

**హైదరాబాద్, జూన్ 03 (మనసులో మాట):** భారత్ లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయి వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఏడాది డిసెంబర్ లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ ప్రపంచ సదస్సు'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషాతిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ఆహ్వానంపై మషాతిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు.

# ఎన్టీఆర్ తోనే సామాజిక న్యాయం!

**ఆయన పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వచ్చాకే బలహీన వర్గాలకు మేలు**

**విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకోబోమని టీడీపీ నేతల హెచ్చరిక**

**రాజకీయ నేతల వ్యాఖ్యలపై ఎన్ టీ ఆర్ భవన్ లో మీడియా సమావేశం**

**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** ఎన్ టీ ఆర్ పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీ డీ పీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్ బ్యూరో మెంబర్ అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్ టీ ఆర్ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ టీ ఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్ టీ ఆర్ సమాధి తొలగిస్తామని, ఎన్ టీ ఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్ గా ఉందని అరవింద్ అన్నారు.

### అడ్డుకుంటే ఊరుకోం..

కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగులు పెట్టుకోవచ్చని, పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగులు పెట్టుకోవద్దని.. పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అరవింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

### కే సీ ఆర్, కాంగ్రెస్ పాలనపై విమర్శలు..

తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కే సీ ఆర్ పదేళ్లు పాలన చేశారని టీ డీ పీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్లుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అరవై, డెబ్బై ఏళ్లు జరగని దోపిడీ కే సీ ఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు.

### జనసేనతో కలిసి పోటీ..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీ డీ పీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీ డీ పీ ని అప్రతిష్టపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్ టీ ఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు.

### దాడులకు భయపడేది లేదు..

ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



# బెంగాల్‌లో మమతకు బ్యాడ్ టైమ్!

## దూరమవుతున్న నేతలు.. టీఎంసీలో సంక్షోభం

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్యెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్యెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరవేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# ఢిల్లీలో ఘోర అగ్ని విషాదం

- విదేశీయుల సహా 21 మంది మృతి
- మాల్వీయానగర్ హోటల్‌లో బీభత్సం
- 40 మందికి పైగా రక్షణ.. పలువురి పరిస్థితి విషమం
- హోటల్ భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు
- మృతుల కుటుంబాలకు పరిహారం : మోదీ






**న్యూఢిల్లీ, జూన్ 3:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుని 21 మంది మృతి చెందారు. మా ఓల్వీయా నగర్‌లోని హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న ఫ్లోరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఈ విషాదం సంభవించింది. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉదయం 8.50 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగినట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. వెంటనే అగ్నిమాపక దళాలు, పోలీసులు, విపత్తు స్పందన బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అయితే అప్పటికే భవనమంతా దట్టమైన పొగతో నిండిపోవడంతో లోపల ఉన్నవారిని బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. సహాయక బృందాలు 40 మందికి పైగా బాధితులను రక్షించి వివిధ ఆసుపత్రులకు తరలించాయి. మాక్స్ ఆసుపత్రికి తరలించిన 39 మందిలో 18 మంది మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో 15 మందికి



ఐసీయూలో చికిత్స అందిస్తుండగా, వారిలో ఎనిమిది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. స్వల్ప గాయాలైన కొందరిని చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు 13 మందిని తరలించగా, వారిలో భవనం నుంచి దూకిన బాధితులతో పాటు సహాయక చర్యల్లో పాల్గొన్న ఢిల్లీ పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం కారణంగా భవనం తీవ్రంగా దెబ్బతింది. కాలిపోయిన వస్తువులు, శిథిలాలు, పగిలిన అద్దాల ముక్కలు పరిసర ప్రాంతాల్లో చెల్లాచెదురుగా కనిపించాయి. సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా అధికారులు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి ఏకే మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన భవనంలో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెస్టారెంట్ ఉండగా, మిగిలిన భాగాన్ని హోటల్‌గా వినియోగిస్తున్నారు. వైద్య చికిత్సల కోసం భారతదేశానికి వచ్చే విదేశీయులు ఎక్కువగా ఈ హోటల్‌లో బస చేస్తుండటంతో మృతుల్లో విదేశీయుల సంఖ్య అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతులు ప్రధానంగా మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, మంటలు వ్యాపించడంతో కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు అద్దాలు పగులగొట్టి భవనం పై అంతస్తుల నుంచి కిందకు దూకారు. ఒక వ్యక్తి కిందపడటంతో కాలు విరిగినట్లు కనిపించిందని వారు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపు స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కిందకు దూకిన వారికి గాయాలు తక్కువగా తగలేందుకు కొందరు నేలపై పరుపులు పరిచారు. మరికొందరు బాధితులకు అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం సహాయక చర్యలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. హోటల్‌కు ఒకే ఒక్క ప్రవేశ, నిష్క్రమణ మార్గం ఉండటంతో పాటు అగ్నిమాపక శాఖ నుంచి అవసరమైన అనుమతులు, ఎన్‌ఓసీ ఉన్నాయా లేదా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు.

# గిరిజనాభివృద్ధికి రాష్ట్రపతి పిలుపు

## జాతీయ సదస్సుకు ప్రారంభం
## గిరిజన సంక్షేమంపై దృష్టి
## వికసిత భారత్ లక్ష్య సాధన




**న్యూఢిల్లీ, జూన్ 3 :** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహించిన జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు, సమీకృత గిరిజనాభివృద్ధి ప్రాజెక్టుల బలోపేతంపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం న్యూఢిల్లీలో జరిగింది. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించి పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి బెంగళూరులోని భారత విజ్ఞాన సంస్థలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని, ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డెబ్బై ఐదు అంతరిక్ష ప్రయోగశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక విద్యను గిరిజన విద్యార్థులకు చేరువ చేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భారతదేశం రెండు వేల నలభై ఏడవ సంవత్సరానికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోందని రాష్ట్రపతి అన్నారు. ఈ లక్ష్య సాధనలో గిరిజన సమాజాల సమగ్ర అభివృద్ధి అత్యంత కీలక భాగమని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధిలో గిరిజనుల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. అయితే ఆ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన ప్రజలకు సూచించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రపతి సూచించారు. యువత ఆధునిక విద్యను అభ్యసించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. గిరిజన విద్యార్థులు విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. సమగ్ర అభివృద్ధి ద్వారానే గిరిజన సమాజాలు మరింత బలోపేతం అవుతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. గిరిజనుల సాధికారత, విద్యా ప్రగతి, ఆర్థిక స్వావలంబన ద్వారా వికసిత భారత్ నిర్మాణంలో వారు కీలక భాగస్వాములుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి. పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మి హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా.. వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.



# గాన గంధర్వుడు ఎస్పీ బాలు

## తెలుగు పాటకు చిరస్మరణీయ స్వరం

## నేడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి ప్రత్యేకం

తెలుగు సినీ సంగీత చరిత్రలో ఎన్నటికీ చెరగని ముద్ర వేసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఐదు దశాబ్దాలకు పైగా తన మధుర గానంతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్న ఆయన, తెలుగు పాటకు ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. జూన్ 4 ఆయన జయంతి సందర్భంగా సంగీత ప్రపంచం మరోసారి ఆ మహాగాయకుడిని స్మరించుకుంటోంది.

1946 జూన్ 4న నాటి నెల్లూరు జిల్లా కోనేటమ్మపేట గ్రామంలో జన్మించిన బాలసుబ్రహ్మణ్యం చిన్ననాటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకున్నారు. ఆయన తండ్రి సాంబమూర్తి హరికథా పండితుడు కావడంతో సంగీత వాతావరణంలోనే ఎదిగారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూనే పలు సంగీత పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. 1964లో మద్రాస్ తెలుగు కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన సంగీత పోటీలో ప్రథమ బహుమతి సాధించడం ఆయన జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. ఆ ప్రతిభను గుర్తించిన సంగీత దర్శకుడు కోదండపాణి సినీ గాన రంగంలో అవకాశం కల్పించారు. 1966లో విడుదలైన శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న చిత్రంతో నేపథ్య గాయకుడిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ తదితర 11 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి ప్రపంచ రికార్డు సృష్టించారు. శాస్త్రీయ సంగీతంలో ప్రత్యేక శిక్షణ లేకపోయినా, స్వరపరచిన బాణీని అత్యంత శ్రుతి, లయబద్ధంగా ఆలపించే అసాధారణ ప్రతిభ ఆయన సొంతం. పాటలోని భావాన్ని తన గాత్రంతో శ్రోతల హృదయాలకు చేరవేయడంలో ఆయనకు సాటి మరొకరు లేరనే చెప్పాలి. శంకరాభరణం, సాగర సంగమం వంటి చిత్రాల్లోని పాటలు ఆయన గాన ప్రతిభకు నిలువెత్తు నిదర్శనాలు. హిందీలో ఏక్ దూజే కే లియే చిత్రంలోని గీతాలు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ పొందాయి. గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడు, నటుడు, డబ్బింగ్ కళాకారుడిగా కూడా ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. 40కి పైగా చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించగా, అనేక చిత్రాల్లో నటించారు. బుల్లితెరపై పాడుతా తీయగా ద్వారా కొత్త తరానికి వేదిక కల్పించి ఎందరో గాయనీ గాయకులను తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా పద్మశ్రీ, పద్మభూషణ్, పలు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు, గౌరవ డాక్టరేట్లు వరించాయి. తెలుగు సినీ గాయకుల్లో అత్యధిక నంది అవార్డులు అందుకున్న కళాకారుల్లో ఆయన ఒకరు. 2020లో కరోనా బారినపడి చెన్నైలో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న కన్నుమూసినా, ఆయన గాత్రం మాత్రం సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. తరాలు మారినా, సంగీత అభిరుచులు మారినా, ఎస్పీ బాలు పాడిన పాటలు ఎప్పటికీ కొత్తగానే వినిపిస్తుంటాయి. తెలుగు పాట ఉన్నంత కాలం, సంగీతం ఉన్నంత కాలం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన గళం తెలుగు సంగీత ప్రపంచానికి శాశ్వత సంపదగా మిగిలిపోతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బాల్యాన్ని బంధిస్తున్న బాలకార్మికత్వం

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే చిన్నారులకు స్వేచ్ఛ

## నేడు అంతర్జాతీయ పీడిత బాలల దినోత్సవం

**ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బాని సత్వం. పిల్లలవద్ద బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టి, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన.**



ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్తోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథ మిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది.

1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలుచేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ దానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బూదరాజు రాధాకృష్ణ జీవితం.. తెలుగు భాషకు అంకితం

**తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి**



తెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణిక్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యం--ఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది.

బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సాగింది. భాషపై ఆసక్తితో "ఎఱం-శీతీఅఝ్రీ +తీఖఎఝతీ శీట ఝఖతీశ్రీఎ ుఎశ్రీబన్త్రబ ×అం౧ఎతీఅజ్ఞూఅశీఅం" అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ , తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ధర్మం ముగిసి పోలేదు--కావలసిన చోటా, అవసరమైన సమయంలో రచన ద్వారా ఆయన శబ్దజీవితమై మిగిలారు.

పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థ లో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు.

**"పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి.**

తెలుగు భాషా శాస్త్ర పరిశోధనకు బూదరాజు కృషి విలువైనదిగా గుర్తించ బడింది. "వాస్తు పదకోశం", "వ్యవహార కోశం", "తెలుగు దినపత్రికల భాష" వంటి ప్రామాణిక రచనలు ఆయన మేధస్సుకు నిదర్శనాలు. నన్నయ పూర్వకాలపు శాసన భాషను అధ్యయనం చేసి, మాండలికాల వ్యాప్తిపై చేసిన విశ్లేషణ భాషా పరిశోధకులకు గొప్ప వనరుగా నిలిచింది. వ్యాకరణ నియమాలు, వినియోగ నిబంధనలు, భాషా అభివృద్ధిలో సమాజ పాత్ర వంటి అంశాలపై ఆయన వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవిగా భావించ బడుతున్నాయి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్ఠమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవరాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు. అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు.

జ్ఞానం, వినయం, మిత భాషణం, శ్రద్ధ అనే నాలుగు గుణాలతో ఆయన మానవీయత వెలిసింది. నుకల నారాయణ, కాళోజీ నారాయణరావు, న్యాపతి సుబ్బారావు వంటి ప్రముఖులతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన సమాజాభిముఖ దృక్పథానికి ప్రతీకలుగా నిలిచాయి.

విశేషమైన విషయ పరిపక్వత, పదాలను నాణ్యంగా ఉపయోగించే నైపుణ్యం ఆయన రచనలకు స్ఫూర్తినిచ్చాయి. బూదరాజు రాధాకృష్ణ జీవితం తెలుగు భాషకు అంకితమై, పరిశోధనతో నిండి, శ్రద్ధతో నడిచిన ఆత్మసాక్షాత్కార యాత్ర. ఆయన రచనలు నేటికీ తెలుగు అధ్యాపకులకు, పాత్రికేయులకు, తర్జుమకారులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తి–సజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలో–ఇప్పటికీ స్పందిస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




# బంగారం ధరలకు బ్రేక్

**హైదరాబాద్, జూన్ 3 :** గత కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు నేడు స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు దేశీయ డిమాండ్ పెరగడంతో బంగారం ధరల్లో రూ.10 చొప్పున పెరుగుదల నమోదైంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ధరలు మరోసారి షాక్ ఇచ్చాయి. గుడ్‌రిటర్న్స్ వివరాల ప్రకారం, ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,56,220కు చేరుకుంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,200గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,17,170గా ఉంది. మూడు రకాల బంగారం ధరలపై రూ.10 చొప్పున పెరుగుదల కనిపించింది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. 100 గ్రాముల వెండిపై రూ.10, కిలో వెండిపై రూ.100 పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి ధర రూ.29,000గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,90,000కు చేరుకుంది. అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, డాలర్ మారకం విలువలు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయా లేదా స్థిరపడతాయా అన్న అంశంపై పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఏఐ ఉద్యోగాల జోరు

## ఐటీ రంగంలో కొత్త అవకాశాలు

**న్యూఢిల్లీ, జూన్ 3 :** ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నప్పటికీ, కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాలకు మాత్రం విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా "ఫార్వర్డ్-డిప్లాయ్డ్ ఇంజనీర్" అనే కొత్త తరహా ఉద్యోగ విభాగం ఐటీ రంగంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న అవకాశంగా మారింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటనలు 729 శాతం పెరగడం విశేషం. ఈ ఉద్యోగాల్లో ఎంపికైన వారికి ఏడాదికి సుమారు రూ.1.4 కోట్ల నుంచి రూ.1.6 కోట్లకు పైగా వేతనాలు లభిస్తున్నాయి. ప్రముఖ ఉద్యోగాల వేదిక విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2025 ఏప్రిల్‌లో 643గా ఉన్న ఈ ఉద్యోగాల సంఖ్య 2026 ఏప్రిల్ నాటికి 5,330కు చేరుకుంది. కృత్రిమ మేధస్సు రంగంలో ముందంజలో ఉన్న అనేక ప్రముఖ సంస్థలు ఈ ఉద్యోగాల కోసం పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతున్నాయి. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఏఐ సాంకేతికతను అమలు చేయగల నిపుణుల కోసం కంపెనీలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఒకవైపు సాంకేతిక రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మాత్రమే లక్షకు పైగా ఉద్యోగులు వివిధ సంస్థల్లో ఉపాధి కోల్పోయినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అనేక అంతర్జాతీయ సంస్థలు ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నాయి. గతంలో అధిక సంఖ్యలో నియామకాలు చేపట్టడం, మార్కెట్ మందగమనం, వ్యాపార లక్ష్యాలు నెరవేరకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే ఇదే సమయంలో కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను వ్యాపారాల్లో అమలు చేయగల నిపుణుల అవసరం భారీగా పెరిగింది. దీంతో మిగిలిన రంగాల్లో ఉద్యోగాలు తగ్గుతున్నప్పటికీ, ఈ ప్రత్యేక విభాగంలో అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి.

### ఫార్వర్డ్-డిప్లాయ్డ్ ఇంజనీర్ బాధ్యతలేమిటి?

ఫార్వర్డ్-డిప్లాయ్డ్ ఇంజనీర్లు కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ మరియు కస్టమర్ వ్యాపార అవసరాల మధ్య కీలక వారధిగా వ్యవహరిస్తారు. సంస్థలు రూపొందించిన ఏఐ సాధనాలను కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా మార్చడం, వారి వ్యాపార ప్రక్రియల్లో విజయవంతంగా అమలు చేయడం, తర్వాత అవి సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించడం వీరి ప్రధాన బాధ్యతలు. సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా వ్యాపార అవసరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి.

### అనుభవజ్ఞులకు భారీ డిమాండ్

ఈ ఉద్యోగాలకు కంప్యూటర్ శాస్త్రం, యంత్ర అభ్యాసం లేదా సంబంధిత సాంకేతిక విభాగాల్లో విద్యార్హతలతో పాటు పలు సంవత్సరాల సాఫ్ట్‌వేర్ అనుభవం అవసరమవుతోంది. సాంకేతిక నైపుణ్యాలతో పాటు కస్టమర్లతో సమర్థంగా పనిచేసే సామర్థ్యం కూడా కీలకంగా మారింది. వ్యాపార సంస్థల్లో కృత్రిమ మేధస్సును సమర్థంగా ప్రవేశపెట్టగల నిపుణులకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ నెలకొంది. సాంకేతిక రంగం భవిష్యత్తు పూర్తిగా కృత్రిమ మేధస్సు వైపు మళ్లుతున్న నేపథ్యంలో, ఈ తరహా నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులకు రాబోయే కాలంలో మరింత అధిక అవకాశాలు లభించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.




# ఇథనాల్ కారుతో మారుతి కొత్త అడుగు




**న్యూఢిల్లీ, జూన్ 3 :** దేశీయ ఆటోమొబైల్ రంగంలో అతిపెద్ద సంస్థగా కొనసాగుతున్న మారుతి సుజుకి మరో కీలక ముందడుగు వేయబోతోంది. పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సంస్థ తన తొలి పూర్తి ఇథనాల్ ఆధారిత కారును ఈ నెల 4న మార్కెట్లోకి తీసుకురానుంది. 'మారుతి సుజుకి ఈ-100' పేరుతో రానున్న ఈ వాహనం వంద శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే విధంగా రూపొందించబడినట్లు సమాచారం. మారుతి సుజుకికి అత్యంత ప్రజాదరణ తెచ్చిపెట్టిన వాగన్-ఆర్ మోడల్ ఆధారంగా ఈ కొత్త వాహనాన్ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పెట్రోల్‌కు ప్రత్యామ్నాయంగా ఇథనాల్‌ను ఉపయోగించడం ద్వారా ఇంధన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని కూడా గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో విక్రయించే పెట్రోల్‌లో సుమారు 20 శాతం ఇథనాల్‌ను కలుపుతున్నారు. భవిష్యత్తులో ఈ శాతాన్ని మరింత పెంచి విదేశాల నుంచి చమురు దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే వాహన తయారీ సంస్థలు కూడా ఇథనాల్ ఆధారిత వాహనాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. నాలుగు చక్రాల వాహనాలతో పాటు ద్విచక్ర వాహన రంగంలోనూ ఇథనాల్ సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. దేశీయ ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ కూడా పూర్తి ఇథనాల్ ఇంధనంతో నడిచే కొత్త మోటార్‌సైకిల్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ వాహనం ఆవిష్కరణ కూడా ఇదే సమయంలో జరగనుండటం విశేషం. దేశంలో హరిత ఇంధన వినియోగాన్ని పెంచడం, రైతులు పండించే చెరకు వంటి పంటలకు అదనపు డిమాండ్ కల్పించడం, చమురు దిగుమతుల ఖర్చును తగ్గించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో మారుతి సుజుకి తీసుకొస్తున్న కొత్త వాహనం దేశ ఆటోమొబైల్ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇథనాల్ ఆధారిత వాహనాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తే వినియోగదారులకు తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యం లభించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్ద ఎత్తున మేలు జరిగే అవకాశం ఉందని రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్‌పై అదనపు సుంకాల ప్రతిపాదన



**న్యూఢిల్లీ, జూన్ 3 :** బలవంతపు శ్రమ లేదా వెట్టిచాకిరి ద్వారా తయారవుతున్న వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదనే కారణంతో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 దేశాలపై అదనపు దిగుమతి సుంకాలు విధించాలని అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం అమెరికా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొన్ని దేశాల్లో పెరుగుతున్న పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం కూడా ప్రపంచ వాణిజ్య సమతుల్యతను దెబ్బతీస్తోందని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా వాణిజ్య చట్టాల్లోని ప్రత్యేక నిబంధనల ప్రకారం ఈ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. బలవంతపు శ్రమతో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించకుండా కట్టడి చేయడంలో పలు దేశాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలోనే సంబంధిత దేశాలపై అదనపు సుంకాల విధింపు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పందించింది. అమెరికా వ్యక్తం చేసిన ఆందోళనలపై ఇరు దేశాల మధ్య ఇప్పటికే చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. వెట్టిచాకిరి నిర్మూలన విషయంలో భారత్ కట్టుబడి ఉందని, ఈ అంశంపై దేశంలో అమలవుతున్న చట్టాలు, చర్యల గురించి అమెరికా అధికారులకు వివరిస్తున్నట్లు తెలిపింది. భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్రం పేర్కొంది. అదనపు సుంకాల అంశంపై ఏర్పడిన తాజా వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చాలా కాలంగా చర్చల్లో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి జరుగుతోందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే భారత్--అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య విధానాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత్ తన ఎగుమతుల ప్రయోజనాలను కాపాడుకుంటూనే, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్మిక హక్కులు, ఉత్పత్తి విధానాల విషయంలో మరింత పారదర్శకతను పాటించేందుకు చర్యలు తీసుకుంటోందని కేంద్రం స్పష్టం చేసింది.

# పెట్రోల్ వినియోగం పెరుగుదల
# ఎల్పీజీ, ఎగుమతుల్లో తగ్గుదల

**న్యూఢిల్లీ, జూన్ 3 :** భారత ఇంధన మార్కెట్‌లో ఇటీవలి కాలంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పెట్రోలియం ప్రణాళిక మరియు విశ్లేషణ విభాగం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, దేశంలో డీజిల్‌తో పోలిస్తే పెట్రోల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2026 మే నెల నాటికి పెట్రోల్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 2.8 శాతం పెరిగి 3,888 వేల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. వ్యక్తిగత వాహనాల వినియోగం పెరగడం, ప్రజల ప్రయాణ విధానాల్లో వచ్చిన మార్పులు, ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటి అంశాలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. డీజిల్ వినియోగంలో కూడా స్వల్ప వృద్ధి నమోదైనప్పటికీ, పెట్రోల్ డిమాండ్‌తో పోలిస్తే అది తక్కువగానే ఉంది. వ్యక్తిగత రవాణా సాధనాలపై ప్రజలు ఎక్కువగా ఆధారపడటం వల్ల పెట్రోల్ విక్రయాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో కూడా ఈ ధోరణి కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఎల్పీజీ వినియోగంలో భారీ తగ్గుదల

దేశంలో అత్యధికంగా తగ్గుదల నమోదైన ఇంధనంగా ఎల్పీజీ నిలిచింది. 2026 మే నెలలో ఎల్పీజీ వినియోగం 19.16 శాతం క్షీణించి 21.2 లక్షల టన్నులకు పడిపోయింది. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన దిగుమతుల్లో అంతరాయాలు ఏర్పడటం దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. సరఫరా సమస్యలను నియంత్రించేందుకు ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ పంపిణీపై కొన్ని పరిమితులు విధించింది. అలాగే బుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడంతో సాధారణ వినియోగదారులు, వ్యాపార వర్గాలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఫలితంగా ఎల్పీజీ వినియోగం గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## ఇంధన ఎగుమతుల్లో క్షీణత

భారతదేశం నుంచి జరుగుతున్న పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ మొత్తం ఎగుమతుల్లో పెట్రోలియం ఉత్పత్తుల వాటా 8.8 శాతానికి పడిపోయింది. ఇది గత పదేళ్లలోనే అత్యల్ప స్థాయిగా నమోదైంది. ముఖ్యంగా డీజిల్, విమానయాన ఇంధన ఎగుమతులు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా డీజిల్ ఎగుమతులు క్షీణిస్తుండగా, విమానయాన ఇంధన ఎగుమతులు 20 శాతానికి పైగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ మందగించడం, సరఫరా వ్యవస్థలో ఏర్పడిన అస్థిరత ఈ పరిస్థితికి కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. దేశీయ వినియోగం పెరుగుతున్నప్పటికీ, విదేశీ మార్కెట్లలో డిమాండ్ బలహీనపడటం రిఫైనరీల ముందు కొత్త సవాళ్లను తీసుకొస్తోంది. భారత ఇంధన రంగ భవిష్యత్తు అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పనితీరు ప్రభావం..
# విప్రో సీఈఓ జీతం తగ్గింపు



**బెంగళూరు, జూన్ 3 :** ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థ విప్రో ప్రధాన కార్యనిర్వాహక అధికారి శ్రీనివాస్ పల్లియా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.49.6 కోట్ల వేతన ప్యాకేజీ అందుకున్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆయన వేతనం తగ్గినట్లు సంస్థ నివేదికలు వెల్లడించాయి. కంపెనీ నిర్దేశించుకున్న పనితీరు లక్ష్యాలను పూర్తిగా చేరుకోలేకపోవడంతో పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలలో కోత విధించబడింది. ప్రస్తుతం సమాచార సాంకేతిక రంగం ఎదుర్కొంటున్న మందగమనం, ఖర్చుల నియంత్రణ చర్యలు, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఈ వేతన తగ్గింపుకు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ విప్రోలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఉన్నతాధికారిగా శ్రీనివాస్ పల్లియా కొనసాగుతున్నారు. పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలలో తగ్గింపు కారణంగా వార్షిక ఆదాయంలో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా సమాచార సాంకేతిక రంగం ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో అనేక సంస్థలు ఖర్చులను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాయి. అదే విధంగా విప్రో కూడా వ్యయ నియంత్రణపై దృష్టి సారించింది. కంపెనీ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేయడంలో ఎదురైన సవాళ్లు సీఈఓ వేతనంపై ప్రభావం చూపినట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో వ్యాపార పరిస్థితులు మెరుగుపడితే ప్రోత్సాహకాల రూపంలో ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక విప్రో కార్యనిర్వాహక అధ్యక్షుడు రిషద్ ప్రేమ్‌జీ వేతనంతో పోలిస్తే శ్రీనివాస్ పల్లియా వేతనం దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఒకే సంస్థలో అత్యున్నత స్థాయి నాయకుల మధ్య వేతనాల్లో ఇంత పెద్ద వ్యత్యాసం ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సంస్థ వ్యాపార విస్తరణ, ఆదాయ వృద్ధి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచేందుకు శ్రీనివాస్ పల్లియా నాయకత్వం కీలకంగా మారింది. రానున్న కాలంలో విప్రో పనితీరు ఎలా ఉండబోతోందనే అంశంపై పెట్టుబడిదారులు, మార్కెట్ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.



## భారత్-న్యూజిలాండ్ మధ్య చరిత్రాత్మక క్రికెట్ సిరీస్

**ఆక్లాండ్, జూన్ 3 :** భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య చరిత్రలోనే అతిపెద్ద ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు దాదాపు 40 రోజుల పాటు కొనసాగే ఈ పర్యటనలో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు, ఐదు ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఉన్నాయి. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇంత పెద్ద స్థాయిలో ద్వైపాక్షిక సిరీస్ ఎప్పుడూ జరగలేదు. అక్టోబర్ 22న క్రైస్ట్‌చర్చ్‌లో తొలి ఇరవై ఓవర్ల మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఐదు ఇరవై ఓవర్ల మ్యాచ్‌లు పూర్తయ్యాక ఒకరోజు అంతర్జాతీయ సిరీస్ ప్రారంభమవుతుంది. నవంబర్ 4న ఆక్లాండ్‌లో తొలి ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో జరుగుతుంది. రెండో టెస్టు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో నిర్వహించనున్నారు. న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రధాన మార్కెటింగ్ అధికారి గ్లెన్ క్రిట్‌చెల్లీ మాట్లాడుతూ, ఇది కేవలం క్రికెట్ సిరీస్ మాత్రమే కాదని, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించే వేడుకగా కూడా నిలుస్తుందని తెలిపారు. భారత్ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా వంటి ప్రముఖ ఆటగాళ్లు కూడా ఈ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉందని, వారి రాకకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. 2019-20 సీజన్ తర్వాత భారత్ న్యూజిలాండ్‌లో పర్యటించలేదు. అయితే ఆ తర్వాత రెండు సార్లు న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ నేపథ్యంలో రానున్న ఈ భారీ సిరీస్‌పై ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



## ప్రజ్ఞానందకు మరో ఘన విజయం

**ఓస్లో, జూన్ 3 :** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ప్రపంచ చెస్ వేదికపై తన సత్తా చాటాడు. నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు మ్యాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. క్లాసికల్ విభాగంలో కార్ల్‌సన్‌పై సాధించిన ఈ విజయం ప్రజ్ఞానందకు ఈ ఏడాదిలో రెండో గెలుపు కావడం విశేషం. డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇప్పటివరకు 12 పాయింట్లు సాధించిన అతడు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ ఏడాది క్లాసికల్ చెస్‌లో కార్ల్‌సన్‌పై రెండుసార్లు విజయం సాధించిన తొలి ఆటగాడిగా ప్రజ్ఞానంద అరుదైన ఘనత అందుకున్నాడు. మరోవైపు ప్రపంచ చాంపియన్ డీ గుకేశ్‌కు నిరాశ ఎదురైంది. ఎనిమిదో రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ అలిరేజా ఫిరౌజా చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో గుకేశ్ పాయింట్ల పట్టికలో దిగువ స్థానాల్లోనే కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అలిరేజా ఫిరౌజా 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, అమెరికాకు చెందిన గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 14 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. టోర్నీలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇక అయిదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన మ్యాగ్నస్ కార్ల్‌సన్ ఈ టోర్నీలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ఇప్పటివరకు కేవలం 9 పాయింట్లు మాత్రమే సాధించిన అతడు వెనుకబడ్డాడు. మిగిలిన రెండు క్లాసికల్ గేమ్‌ల్లో గెలిచినా అగ్రస్థానానికి చేరుకోవడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద సాధించిన విజయాల సంఖ్య ఇప్పుడు మూడుకు చేరుకుంది. భారత యువ చెస్ సంచలనం మరోసారి ప్రపంచ దృష్టిని తనవైపు తిప్పుకోవడంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆఫ్ఘాన్ టెస్టుకు సిరాజ్ ఆడటంపై సందిగ్ధత




**చండీగఢ్, జూన్ 3 :** టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో వరుసగా మ్యాచ్‌లు ఆడిన నేపథ్యంలో అతనిపై పనిభారం పెరగడంతో విశ్రాంతి ఇవ్వాలా అనే అంశాన్ని భారత జట్టు యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ విషయంపై వచ్చే రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి చండీగఢ్‌లోని న్యూ పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు ప్రారంభం కానుంది. గుజరాత్ టైటాన్స్ తరఫున ఐపీఎల్ మొత్తం సీజన్ ఆడిన సిరాజ్ ఫైనల్ వరకు జట్టుతో కొనసాగాడు. దీంతో అతనికి విశ్రాంతి అవసరమని వైద్య బృందం, జట్టు నిర్వహణ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సిరాజ్ జట్టుతో కలిసి చండీగఢ్‌లోనే ఉండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడు. ఒకవేళ సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే, జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకీబ్ నబీకి జట్టులో అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అకీబ్ నబీ 2025-26 రంజీ సీజన్‌లో 60 వికెట్లు పడగొట్టి తన జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అతడిని ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్ టెస్టు అరంగేట్రం చేసే సూచనలు కూడా బలంగా కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తిగా అనుభవంలేని బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.

## ఐపీఎల్-2027కు కమిన్స్ దూరమా?

### ఎస్ఆర్‌హెచ్‌లో చర్చనీయాంశం




**హైదరాబాద్, జూన్ 3 :** సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళనకు గురిచేసే వార్త ఒకటి క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా స్టార్ పేసర్, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్-2027 సీజన్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ షెడ్యూల్ ఉండనుంది. యాషెస్ సిరీస్, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే ప్రపంచకప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీలు వరుసగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో జట్టుకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐపీఎల్‌కు విరామం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిరంతర క్రికెట్ కారణంగా శారీరక అలసట, గాయాల ప్రమాదం పెరుగుతుందని భావిస్తున్న కమిన్స్, జాతీయ జట్టు బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. గతంలో కూడా పలువురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా ఐపీఎల్‌కు దూరమైన సందర్భాలు ఉన్నాయి. ఒకవేళ కమిన్స్ నిజంగానే ఐపీఎల్-2027లో ఆడకపోతే సన్‌రైజర్స్ హైదరాబాద్ కొత్త కెప్టెన్ ఎంపికపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ఇషాన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే కమిన్స్ భవిష్యత్తు, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ప్రస్తుతం అధికారిక స్పష్టత లేదు. ఫ్రాంచైజీ లేదా ఆటగాడి నుంచి ప్రకటన వెలువడే వరకు ఈ వార్తలను ఊహాగానాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎస్ఆర్‌హెచ్ అభిమానులు మాత్రం కమిన్స్ జట్టుతోనే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## రోహిత్, హార్దిక్‌కు బీసీసీఐ పిలుపు

**న్యూఢిల్లీ, జూన్ 3 :** ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వెంటనే బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరానికి హాజరుకావాలని బోర్డు ఆదేశించింది. రాబోయే సిరీస్‌కు ముందు ఆటగాళ్ల శారీరక దృఢత్వం, మ్యాచ్ సన్నద్ధతను పూర్తిస్థాయిలో అంచనా వేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్ అనంతరం రోహిత్ శర్మ విశ్రాంతితో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించగా, హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకుంటున్న పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రత్యేక ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టి వారి శారీరక సామర్థ్యాన్ని పరిశీలించనున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు ముందు కీలక ఆటగాళ్లు అత్యుత్తమ ఫామ్‌లో ఉండేలా చూడటంతో పాటు జట్టు సమతుల్యతను మెరుగుపరచడమే బోర్డు లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ముందున్న రద్దీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్ల పనిభార నిర్వహణ, ఫిట్‌నెస్ ప్రమాణాల విషయంలో రాజీపడకూడదని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలకు ప్రత్యేక శిబిరంలో పాల్గొనాలని స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ప్రపంచకప్‌లో భారతీయ మూలాల ముగ్గురు ఆటగాళ్ల సందడి

**న్యూఢిల్లీ, జూన్ 3 :** ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. భారత జాతీయ జట్టు ఈ ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, భారతీయ మూలాలున్న ముగ్గురు యువ ఫుట్‌బాలర్లు వేర్వేరు దేశాల తరఫున బరిలోకి దిగనుండటం భారత అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఖతార్ జట్టుకు ఎంపికైన తహ్సిన్ మహ్మద్ జంషీద్ ఈ జాబితాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కేరళలోని కన్నూర్ జిల్లాకు చెందిన మలయాళీ కుటుంబ మూలాలు కలిగిన తహ్సిన్ ప్రస్తుతం ఖతార్ లీగ్‌లో అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందాడు. కేవలం 19 ఏళ్ల వయసులోనే ప్రపంచకప్ తుది జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అతడు అరుదైన ఘనతను అందుకున్నాడు. న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సర్‌ప్రీత్ సింగ్ కూడా భారతీయ మూలాలున్న ప్రముఖ ఆటగాడు. పంజాబీ కుటుంబానికి చెందిన ఆయన, న్యూజిలాండ్ తరఫున కీలక మిడ్‌ఫీల్డర్‌గా రాణిస్తున్నాడు. గతంలో యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌ల తరఫున ఆడిన అనుభవం కలిగిన సర్‌ప్రీత్, న్యూజిలాండ్ ప్రపంచకప్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆస్ట్రేలియా జట్టులో చోటు దక్కించుకున్న నిషాన్ వేలుపిళ్లై మరో భారతీయ మూలాల ఆటగాడు. తమిళ కుటుంబ నేపథ్యం కలిగిన నిషాన్, వేగవంతమైన వింగర్‌గా గుర్తింపు పొందాడు. ప్రపంచకప్‌లో ఆడనున్న తొలి తమిళ సంతతి ఫుట్‌బాలర్‌గా ఆయన చరిత్ర సృష్టించనున్నాడు. ఇక భారతీయ మూలాలున్న మరో ఆటగాడు నైలు ఆద్య మేసన్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఫిట్‌నెస్ సమస్యలు, జట్టు సమీకరణాల కారణంగా అతని పేరు చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించబడింది. భారత జట్టు ఈ టోర్నీలో లేకపోయినా, భారతీయ మూలాలున్న ఈ ముగ్గురు ఆటగాళ్ల ప్రదర్శన ప్రపంచకప్ సందర్భంగా భారత అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. వారి విజయాలు ప్రపంచ ఫుట్‌బాల్ వేదికపై భారతీయ వారసత్వానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అభిమానులు ఆశిస్తున్నారు.



KANCHARLA మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలని ఎంతో మంది కలలు కంటూ అడుగుపెడతారు. అయితే కొందరికి మాత్రమే స్టార్‌డమ్ దక్కుతుంది. మరికొందరు అవకాశాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు హంసా నందిని. పూణెలో జన్మించి పెరిగిన హంసా నందిని మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లారు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో కొనసాగుతూ పలు టెలివిజన్ ప్రకటనల్లో నటించారు. అనంతరం 2004లో విడుదలైన లిఒకటవుదాంలి చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. దీంతో కొన్ని సినిమాల్లో రెండో కథానాయికగా నటించారు. అయినప్పటికీ పెద్దగా గుర్తింపు రాకపోవడంతో ప్రత్యేక గీతాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో విడుదలైన మిర్చి, భాయ్, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, అలాగే లెజెండ్ చిత్రాల్లో చేసిన స్పెషల్ సాంగ్స్‌తో హంసా నందిని మంచి గుర్తింపు సంపాదించారు. అయితే కెరీర్ మంచి దశలో ఉండగానే 2021లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించారు. తన తల్లి కూడా క్యాన్సర్ కారణంగానే మరణించారని, జన్యుపరమైన కారణాల వల్ల తాను కూడా ఈ వ్యాధి బారిన పడ్డానని అప్పట్లో తెలిపారు. తీవ్ర మనోధైర్యంతో చికిత్స తీసుకుని క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం హంసా నందిని సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. ఫొటోషూట్లు, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అలాగే మంచి పాత్రల కోసం ఎదురుచూస్తూ మళ్లీ సినీ రంగంలో బిజీ కావాలని ప్రయత్నిస్తున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని జయించి జీవితంలో ముందుకు సాగుతున్న హంసా నందిని ప్రయాణం అనేక మందికి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే ఉదాహరణగా నిలుస్తోంది.

# అమెరికాలో పెద్ది దూకుడు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన భారీ క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే రికార్డుల వేట మొదలుపెట్టింది. దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో విదేశీ మార్కెట్‌లోనూ సినిమా సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజా వాణిజ్య వర్గాల సమాచారం ప్రకారం, అమెరికాలో ప్రీమియర్ ప్రదర్శనల ముందస్తు టికెట్ విక్రయాల ద్వారానే 'పెద్ది' చిత్రం 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. విడుదలకు ముందే ఈ స్థాయి వసూళ్లు నమోదు కావడం చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్ చరణ్ నటించిన చిత్రాల్లో అమెరికా మార్కెట్‌లో అత్యంత వేగంగా ముందస్తు వసూళ్లు సాధించిన చిత్రంగా 'పెద్ది' నిలిచినట్లు సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికాలోని పలు ప్రధాన నగరాల్లో ప్రీమియర్ షోలకు టికెట్లు వేగంగా అమ్ముడవుతుండగా, తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల సినీ అభిమానులు కూడా ఈ చిత్రంపై ఆసక్తి చూపుతున్నారు. విడుదలకు ఇంకా కొంత సమయం ఉండగానే 10 లక్షల డాలర్ల మైలురాయిని దాటడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సినిమా విడుదల సమయానికి 20 లక్షల డాలర్లకు పైగా ముందస్తు వసూళ్లు సాధించే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఈ క్రీడా కథా చిత్రంలో రామ్ చరణ్ పూర్తిస్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలు, యాక్షన్, క్రీడా అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రంలోని ప్రచార చిత్రాలు, పాటలు, ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి. ఈ చిత్రంలో జగపతి బాబు, బోమన్ ఇరానీ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. వృద్ధి సినిమాస్ నిర్మించిన 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్‌లోనూ టికెట్ బుకింగ్స్‌కు భారీ స్పందన లభిస్తుండటంతో, రామ్ చరణ్ సినీ ప్రస్థానంలోనే అత్యంత భారీ ఆరంభ వసూళ్లు నమోదు చేసే చిత్రంగా 'పెద్ది' నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అభిమానుల దృష్టి అంతా విడుదల రోజు బాక్సాఫీస్ ఫలితాలపైనే కేంద్రీకృతమైంది.



# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ..

## ఇలియానా వ్యాఖ్యలు వైరల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఎన్.టి. రామారావు జూనియర్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్, తారక్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించిన ఇలియానా, ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "మీరు నటించిన హీరోల్లో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది?" అని యాంకర్ ప్రశ్నించగా, కాసేపు ఆలోచించిన ఇలియానా "తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్" అని చెప్పడం విశేషం. ఇలియానా, తారక్ కాంబినేషన్‌లో వచ్చిన రాఖీ, శక్తి చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'రాఖీ' సినిమాలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, పాటలు మంచి ఆదరణ పొందాయి. తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలు కూడా అప్పట్లో విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు స్క్రీన్‌పై అనుబంధం పరంగా తారక్‌తో ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని ఆమె అభిప్రాయపడినట్లు అభిమానులు భావిస్తున్నారు. ఇలియానా చేసిన ఈ వ్యాఖ్యలు పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం తారక్ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో ఈ వీడియోను అభిమానులు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. "తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే" అంటూ నందమూరి అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్న ఇలియానా ప్రస్తుతం తన ఇద్దరు కుమారులతో కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.

# అబద్ధపు వేధింపుల కేసు పెట్టా

## నటి శిల్పా షిండే..



ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దాదాపు పదేళ్ల క్రితం ఓ నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశానని ఆమె స్వయంగా వెల్లడించడంతో సోషల్ మీడియా, టెలివిజన్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన శిల్పా షిండే ఇటీవల ఓ పోడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన వివాదంపై స్పందిస్తూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లిపై నమోదు చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నిజం కాదని అంగీకరించారు. ఆ సమయంలో కాంట్రాక్ట్‌కు సంబంధించిన వివాదాలు, పెండింగ్ చెల్లింపులు తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని, గత్యంతరం లేక ఆ కేసు పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. అనంతరం తనకు రావాల్సిన చెల్లింపులు అందిన తర్వాత ఇరు పక్షాలు కోర్టు వెలుపల రాజీ చేసుకుని కేసును ముగించుకున్నట్లు వెల్లడించారు. శిల్పా చేసిన ఈ వ్యాఖ్యలపై ఢిల్లీలోని పురుషుల హక్కుల కోసం పనిచేస్తున్న ఓ సంస్థ తీవ్రంగా స్పందించింది. తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినట్లు స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్ట్ చేయాలని ముంబై పోలీసులను కోరింది. నిజమైన బాధితులకు రక్షణ కల్పించేందుకు రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేయడం ఆందోళనకరమని ఆ సంస్థ పేర్కొంది. ఇలాంటి ఘటనలు చట్టాల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఇక శిల్పా వ్యాఖ్యలపై సినీ, టెలివిజన్ వర్గాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెను తీవ్రంగా విమర్శిస్తుండగా, మరికొందరు నిజాన్ని బహిరంగంగా ఒప్పుకున్నందుకు ఆమె ధైర్యాన్ని అభినందిస్తున్నారు. ప్రస్తుతం శిల్పా షిండే, నిర్మాత సంజయ్ కోహ్లి కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఆమె తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం మళ్లీ చర్చకు రావడంతో, భవిష్యత్తులో దీనిపై మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# పండు మాస్టర్‌కు రోడ్డు ప్రమాదం



తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమైన ప్రముఖ నృత్య దర్శకుడు, నర్తకుడు పండు మాస్టర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ప్రకారం, తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పండు మాస్టర్, కార్యక్రమం ముగిసిన అనంతరం తన బృందంతో కలిసి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ప్రయాణ మధ్యలో బృందంలోని ఓ సభ్యుడు అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పండు మాస్టర్ వాహనం నుంచి దిగి రోడ్డుపై నిలబడి పరిస్థితిని గమనిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కోళ్ల రవాణా వాహనం అదుపుతప్పి ఆయనను ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం ఆ వాహనం ఎదురుగా నిలిపి ఉన్న మరో కారును కూడా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పండు మాస్టర్‌ను స్థానికులు, ఆయన బృంద సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, దెబ్బతిన్న ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ప్రముఖ నృత్య కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన పండు మాస్టర్, తన ప్రత్యేక నృత్య శైలి, నృత్య దర్శకత్వంతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. టెలివిజన్ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సాంస్కృతిక వేడుకల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. ఇలాంటి సమయంలో ఆయనకు ప్రమాదం జరగడం అభిమానులను కలవరపెడుతోంది. పండు మాస్టర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రార్థనలు చేస్తున్నారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

# మనసులో మాట

KANCHARLA

# తెలంగాణ

| | | | | |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

గురువారం 04 జూన్ 2026 పేజీ : 16


## మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి!

- అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎమ్ఎల్ బాటిళ్లు
- పాత నిబంధనలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టత

02



## గోదావరి పుష్కరాలకు భారీగా నిధులు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు
- బడ్జెట్లో వెయ్యి కోట్ల రూపాయల కేటాయింపు
- జగిత్యాల జిల్లాకు లభించిన సింహభాగం నిధులు
- ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాలకు మహర్దశ
- త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తికి ఆదేశం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

04



## పవన్‌కు ఎందుకంత అక్రోశం?: కేటీఆర్



- మా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం..
- ఇక్కడ రాజకీయం చెల్లిస్తే ఊరుకోం
- రాష్ట్రం ఏర్పడితే అన్నం తినలేదన్న వ్యక్తివి..
- ఇప్పుడు ఆవిర్భావ సభలా?
- తెలంగాణ కథలో కాంగ్రెస్సే పెద్ద విలన్..
- రేవంత్ మార్క్ అప్పుల రికార్డు

వివరాలు 2లో..



పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ

# వర్షాలు కురిసే అవకాశం

2

*ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు*

- తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక

## రైతు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో తుది దశకు వడ్ల సేకరణ
- కాంగ్రెస్ వైపు ప్రజాప్రతినిధుల చూపు..
- హన్మాజీపేటలో భారీ వలసలు
- గత ఏడాది కంటే అదనంగా ఆరు వేల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఉనికి చాటుకోవడానికే కొనుగోళ్లపై విపక్షాల దుష్ప్రచారం
- మూడు గంటల విద్యుత్ అంటూ కేటీఆర్ తప్పుడు ప్రచారం



5

## రైతులపై కేంద్రానిది

# చిన్నచూపే



### పంజాబ్‌కు పెద్దపీట.. తెలంగాణకు వివక్షేనా?

**ధాన్యం దిగుబడి పెరుగుతున్నా కొనుగోళ్లలో కోత**

**రైతు తెచ్చే చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం**

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై బీజేపీ నేతల నిర్లక్ష్యం**

**మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిందే!**

తెలంగాణ రైతాంగం దేశంలోనే అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి చేస్తూ రికార్డులు సృష్టిస్తుంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర రైతుల పట్ల తీవ్ర వివక్ష చూపుతూ ధాన్యం సేకరణ లక్ష్యాలను కుదించడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే గట్టి సంకల్పంతో రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుంటే, కేంద్రం మాత్రం తన మొండివైఖరితో అన్నదాతలను నిరాశకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత రబీ (యాసంగి) సీజన్‌లో ఇప్పటివరకు అరవై ఏడు లక్షల మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఏకంగా పన్నెండు వేల మూడు వందల డెబ్బై ఐదు కోట్ల రూపాయలను నేరుగా పది లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వెల్లడించారు.

హైదరాబాద్, మనసులో మాట ప్రతినిధి:

వివరాలు 3లో..

## ఉత్తర తెలంగాణకు భారీ రహదారి నజరానా!

- రూ 7500 కేంద్ర నిధులకు ఆమోదం
- జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల దారులకు మహర్దశ
- రవాణా రంగంలో సరికొత్త విప్లవానికి శ్రీకారం
- ప్రధాని మోదీ, మంత్రి గడ్కరీలకు కృతజ్ఞతలు

04



## ఆంధ్రావాళ్లదే అసలైన ప్రాంతీయ వాదం

### మీరు బలవంతంగా కలుపుకుంటే విడిపోవాలనుకున్నాం

### పవన్ వ్యాఖ్యలపై మాజీమంత్రి సింగిరెడ్డి విమర్శలు

హైదరాబాద్, జూన్3 మనసులోమాట : ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయ వాదం అని, ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే మీరే ఉగ్రవాదులు అవుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ వాదంపై అక్కసు వెళ్లగక్కిన నేపథ్యంలో నిరంజన్ రెడ్డి స్పందించారు. తెలంగాణ పౌర సమాజాన్ని కించపరిచేలా మాట్లాడిన పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాచరికపు పాలన పోయి తెలంగాణ దేశంలో విలీనం కావాలని పోరాటం చేసిన జాతీయ వాదులు మా తెలంగాణ ప్రజలు అని గుర్తు చేశారు. మమ్మల్ని బలవంతంగా ఆంధ్రా ప్రాంతంతో విలీనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు మీ దుర్మార్గాల నుంచి విడిపోవాలని పోరాడారు తప్ప తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కాదని స్పష్టం చేశారు. పక్కా రాష్ట్రాల వాళ్లు వచ్చి మనల్ని వెక్కిరిస్తుంటే మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి పెద్ద ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన విధంగా మిగతా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. నీ నోళ్లకు పక్షవాతం వచ్చిందా అని ప్రశ్నించారు. అధికార పక్షం, ప్రతి పక్షం విషయంలో ఎన్నో విభేదాలు ఉండొచ్చు. కానీ, తెలంగాణకు అవమానం జరుగుతుంటే అందరు ఏకతాటి పైకి వచ్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పని చేస్తుందని సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.౦

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

### ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

హైదరాబాద్ మనసులో మాట : ,జూన్ 3: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# పవన్‌కు ఎందుకంత అక్రోశం?: కేటీఆర్



- మా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం..
- ఇక్కడ రాజకీయం చెల్లిస్తే ఊరుకోం
- రాష్ట్రం ఏర్పడితే అన్నం తినలేదన్న వ్యక్తివి..
- ఇప్పుడు ఆవిర్భావ సభలా?
- తెలంగాణ కథలో కాంగ్రెస్సే పెద్ద విలన్..
- రేవంత్ మార్క్ అప్పుల రికార్డు

హైదరాబాద్ మనసులో మాట :

తెలంగాణ రాష్ట్రం కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరేనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) స్పష్టం చేశారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్‌ను తాము ఎల్లప్పుడూ గౌరవిస్తామని, ఒక సోదరుడిగా ఆయన తమ ఇంటికి వస్తే సాదరంగా ఆహ్వానించి హైదరాబాద్ బిర్యానీ తినిపిస్తామని పేర్కొన్నారు. అంతేకానీ, మా సచివాలయంలో కూర్చుంటాం, ఇక్కడ వేలు పెడతాం అంటే మాత్రం తెలంగాణ సమాజం ఊరుకోదని, దానికి అస్సలు కుదరదని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేమీ లేదని, గతంలో జరిగిన రెండు వేల ఇరవై మూడు అసెంబ్లీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆ పార్టీ పోటీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ దేశంలో ఎవరైనా, ఎక్కడైనా పోటీ చేయవచ్చని, కానీ ఎక్కడ పోటీ చేయాలని భావిస్తున్నారో మొదట అక్కడ ఉండే స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. పవన్ కళ్యాణ్ ఇక్కడికి వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదని, వందలాది మంది అమరవీరుల త్యాగాలు, బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున విభజన తీరు సరిగా లేదంటూ పవన్ కళ్యాణ్ మాట్లాడటంపై కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడినప్పుడు బాధతో పదకొండు రోజుల పాటు అన్నం తినలేదని స్వయంగా చెప్పిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు తెలంగాణ ఆవిర్భావం రోజున సభలు పెడతానంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెబుతూ.. తెలంగాణకు ఎల్లప్పుడూ దిక్సూచి కేసీఆర్ మాత్రమేనని, ఇక్కడ వేరే ఎవరి అవసరమూ లేదని తేల్చిచెప్పారు. ప్రాంతీయవాదాన్ని ఉగ్రవాదంతో పోల్చిన పవన్ వ్యాఖ్యలను తప్పుబడుతూ.. మద్రాస్ ప్రాంతం నుండి ఆంధ్ర వేరుపడాలని పొట్టి శ్రీరాములు గారు పోరాడింది కూడా ప్రాంతీయవాదమే కదా, మరి దాన్ని కూడా ఉగ్రవాదం అంటారా అని నిలదీశారు. ప్రధాని మోదీ తన ప్రాంతీయవాదంతో తెలంగాణకు రావాల్సిన పరిశ్రమలను గుజరాత్‌కు తరలించుకుపోతుంటే, జాతీయవాదం ముసుగులో జరుగుతున్న ఈ ఆర్థిక ప్రాంతీయవాదంపై పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ చరిత్రను ప్రస్తావిస్తూ.. పందొమ్మిది వందల యాభై ఆరులో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణలను కలిపింది కాంగ్రెస్ పార్టీయేనని, పందొమ్మిది వందల అరవై తొమ్మిది ఉద్యమంలో మూడు వందల డెబ్బై తొమ్మిది మంది విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నది కూడా ఆ పార్టీయేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణ త్యాగాలకు కారణమై, తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్‌గా నిలిచిన కాంగ్రెస్ పార్టీ.. చివరకు కేసీఆర్ చేసిన సుదీర్ఘ పోరాటం, ప్రాణత్యాగానికి సిద్ధపడి చేసిన దీక్ష వల్లే తప్పనిసరి పరిస్థితుల్లోనే తెలంగాణ ఇచ్చిందని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని, దేశంలోనే ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో ప్రగతి జరిగిందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు దీనిని తప్పు అని నిరూపిస్తే తాను రాజకీయాల నుంచే తప్పుకుంటానని సవాల్ విసిరారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే ఏకంగా నాలుగు లక్షల కోట్ల అప్పులు చేసి సరికొత్త రికార్డు సృష్టించిందని విమర్శించారు. అప్పుల విషయంలో ఒక్కో మంత్రి ఒక్కో లెక్క చెబుతున్నారని ఎద్దేవా చేస్తూ.. ప్రజలకు ఇప్పుడు కరోనా మహమ్మారి కంటే కాంగ్రెస్ ప్రభుత్వమే అత్యంత ప్రమాదకరమైనదని పూర్తిగా అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

# మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి!

- అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎమ్ఎల్ బాటిళ్లు
- పాత నిబంధనలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ
- మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టత



హైదరాబాద్ మనసులో మాట :

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో తొంభై ఎమ్ఎల్, నూట ఎనభై ఎమ్ఎల్, మూడు వందల డెబ్బై ఐదు ఎమ్ఎల్, ఏడు వందల యాభై ఎమ్ఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా నూట యాభై ఎమ్ఎల్, రెండు వందల ఎమ్ఎల్ పరిమాణాల్లో కూడా మద్యం సీసాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# రైతులపై కేంద్రానిది చిన్నచూపే

- ధాన్యం దిగుబడి పెరుగుతున్నా కొనుగోళ్లలో కోత
- రైతు తెచ్చే చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై బీజేపీ నేతల నిర్లక్ష్యం
- మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిందే!



**హైదరాబాద్ మనసులో మాట ::** తెలంగాణ రైతాంగం దేశంలోనే అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి చేస్తూ రికార్డులు సృష్టిస్తుంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర రైతుల పట్ల తీవ్ర వివక్ష చూపుతూ ధాన్యం సేకరణ లక్ష్యాలను కుదించడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే గట్టి సంకల్పంతో రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుంటే, కేంద్రం మాత్రం తన మొండివైఖరితో అన్నదాతలను నిరాశకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రస్తుత రబీ (యాసంగి) సీజన్‌లో ఇప్పటివరకు అరవై ఏడు లక్షల మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఏకంగా పన్నెండు వేల మూడు వందల డెబ్బై ఐదు కోట్ల రూపాయలను నేరుగా పది లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వెల్లడించారు. అకాల వర్షాల వల్ల తడిసిన పది వేల రెండు వందల పదిహేను మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఎనిమిది వేల ఐదు వందల డెబ్బై ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు తెచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగిలో తెలంగాణలో వందల నలభై ఒక్క లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే, కేంద్ర ప్రభుత్వం కేవలం యాభై రెండు లక్షల టన్నులు.. అంటే కేవలం ముప్పై ఏడు శాతానికి మాత్రమే కొనుగోలు లక్ష్యాన్ని పరిమితం చేసిందని పొన్నం ప్రభాకర్ ఎండగట్టారు. ఇదే సమయంలో పంజాబ్‌కు ఎనభై ఆరు శాతం, ఛత్తీసగఢ్‌కు అరవై ఏడు శాతం, హర్యానాకు అరవై ఐదు శాతం, ఒడిశాకు యాభై రెండు శాతం సేకరణ లక్ష్యాలు కేటాయించిన కేంద్రం.. తెలంగాణకు మాత్రం కేవలం ముప్పై ఏడు శాతం కేటాయించడం రాష్ట్రం పట్ల బీజేపీ చేస్తున్న వివక్షకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ధాన్యం కొనుగోళ్లకు ఒక లక్షా ముప్పై ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే ఎనభై నాలుగు వేల కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసిందని చెప్పారు. సగటున ఏడాదికి నలభై రెండు వేల కోట్ల రూపాయలను వెచ్చించడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతను చాటుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటోందని, కొనుగోళ్ల పూర్తి భారాన్ని రాష్ట్రాలపైనే మోపుతోందని ధ్వజమెత్తారు. మొక్కజొన్నకు క్వింటాల్‌కు రెండు వేల నాలుగు వందల రూపాయలు చెల్లిస్తూ ఇప్పటికే ఒక వెయ్యి నూట డెబ్బై రెండు కోట్ల రూపాయలను, అలాగే జొన్నలను క్వింటాల్‌కు మూడు వేల ఆరు వందల తొంభై తొంభై రూపాయల చొప్పున కొనుగోలు చేసి మూడు వందల యాభై కోట్ల రూపాయలను రైతులకు చెల్లిస్తే.. ఇందులో కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ధాన్యం సీలింగ్‌ను వెంటనే ఎత్తివేసి, రాష్ట్రంలో పండిన ధాన్యంలో కనీసం డెబ్బై శాతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణ రైతుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశంపై ప్రజా ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు లేఖలు రాసినా అక్కడ నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇటీవల మే ఆరవ తేదీన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అలాగే మే ఇరవై ఐదవ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖలు రాసినా ఇప్పటివరకు స్పందించలేదని తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రయోజనాల కోసం మరియు రైతులకు రావాల్సిన నీటి హక్కుల విషయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని, ఎందుకు ఒత్తిడి తేవడం లేదని నిలదీశారు. తెలంగాణ బీజేపీ నాయకులు ఇప్పటికైనా తమ మౌనాన్ని వీడాలని సూచించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు నూట యాభై రెండు మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, ఇక్కడి బీజేపీ నేతలపైనే ఉందని, రైతుల ప్రయోజనాల కోసం మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పునరుద్ఘాటించారు.

# జూబ్లీ వద్ద ప్రయాణికులపైకి దూసుకెళ్లిన బస్సు

## బస్సు చక్రాల కింద ఇరుక్కుపోయిన యువకుడు

## క్రేన్ సాయంతో యువకుడికి విముక్తి..ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్ మనసులో మాట :** సికింద్రాబాద్ జూబ్లీహిల్స్ బస్టాప్ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. నియంత్రణ కోల్పోయిన బస్సు ఒక్కసారిగా ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. జేబీఎస్ నుంచి కార్ఖానా వైపు వెళ్తున్న బస్సు అదుపు తప్పి ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న శివ అనే ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు తన బైక్‌తో సహా బస్సు ముందు చక్రాల కింద ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి యువకుడిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ బస్సును జరపడం సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్రేన్‌ను రప్పించి, బస్సును పక్కకు జరిపి, యువకుడిని బయటికి తీశారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో మరో పరిణామం

## అడిషనల్ ఎస్పీ భుంజగరావు ఇంట్లో ఎసిబి సోదాలు

**హైదరాబాద్ మనసులో మాట :** నగరంలో ఏసీబీ అధికారుల సోదాలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఇంట్లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. భుజంగరావు బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. సూర్యాపేటలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు కీలక నిందితుడిగా ఉండి అరెస్ట్ అయి జ్యుడిషియల్ రిమాండ్‌కు వెళ్లి ప్రస్తుతం సస్పెండ్‌లో ఉన్నారు. పోలీస్ శాఖలో పనిచేసిన సమయంలో భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగం నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో 15 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.

# 5 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్ మనసులో మాట :** టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి బోర్డు షెడ్యూల్ విడిదుల చేసింది. అందులో భాగంగా సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5 నుంచి జూన్ 12 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 31 వేల 542 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తం 93 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు జరుగుతాయి. ఫస్ట్ లాంగ్వేజ్, సైన్స్

స్జబెక్టులకు టైమింగ్స్ వేరే ఉన్నాయి. ఫస్ట్ లాంగ్వేజ్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు ఉంటుంది. సైన్స్ ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ గా రెండు పేపర్లు ఉండటంతో.. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఉంటుంది. ఫిజిక్సు, బయాలజీ ఒక్కో పేపర్ ఒక్కో రోజు ఉంటుంది.

సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను విడుదల చేశారు. డిపార్ట్ మెంట్ వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాల్సిందిగా డైరెక్టర్ తెలిపారు. లేదంటే స్కూల్ హెడ్ మాస్టర్ నుంచి కూడా హాల్ టికెట్లు పొందవచ్చునని తెలిపారు.

# తెలంగా ఇన్ సర్వీస్ టీచర్లకు శుభవార్త

## వారి కోసం ప్రత్యేక టెట్ నిర్వహణ

**హైదరాబాద్ మనసులో మాట :** తెలంగాణలో సర్వీస్‌లో ఉన్న టీచర్లకు గుడ్‌న్యూస్! ఇకపై ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా రెండు సాధారణ టెట్‌లకు అదనంగా మరో రెండు ప్రత్యేక టెట్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక టెట్‌ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గతేడాది సాధారణ టెట్ లో భాగంగానే ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంపై టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రత్యేక టెట్ నిర్వహించాలని తమతో పాటు పలు సంఘాలు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మాత్రం కొన్ని సంఘాల పేర్లు మాత్రమే పేర్కొనడం భావ్యం కాదని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫోన్ టాపింగ్ కేసు

## తీగల, లంకల దీపక్‌రెడ్డిలో సిట్ నోటీసులు

**హైదరాబాద్ మనసులో మాట :**ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మూడు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది సిట్. 2014-18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా ఉన్నారు తీగల కృష్ణారెడ్డి.

# విదేశీయుల వివరాల సమర్పణ తప్పనిసరి

**వసతి కల్పించిన 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సమాచారం ఇవ్వడం పక్కా**

**నిబంధనలు ఉల్లంఘిస్తే ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం ప్రకారం కఠిన చర్యలు**

**గృహ యజమానులు, హోటళ్లు, విద్యాసంస్థలకు గోల్కొండ జోన్ డీసీపీ హెచ్చరిక**

**హైదరాబాద్, జూన్ 03 (మనసులో మాట):** హైదరాబాద్ నగర పరిధిలోకి వచ్చే విదేశీయుల బస, ప్రవేశం మరియు నిష్క్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత యాజమాన్యాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఆదేశించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం, నిబంధనల ప్రకారం గృహ యజమానులు, హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, హోమ్ స్టేలతో పాటు విదేశీయులకు ఆశ్రయం లేదా విద్యావకాశాలు కల్పించే విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఆసుపత్రులు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

**ఫారం-సీ సమర్పణ విధిగా చేయాలి:**

విదేశీ పాస్‌పోర్టు కలిగిన వారు, ఓసీఐ కార్డు దారులు, నేపాల్ పౌరులతో సహా తమ వద్ద బస చేసే ప్రతి విదేశీయుడి వివరాలను వసతి కల్పించే సంస్థలు లేదా వ్యక్తులు వారు వచ్చిన 24 గంటల్లోపు ఆన్‌లైన్ పోర్టల్ (ఫారం) ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. అలాగే సదరు విదేశీయుడు ఖాళీ చేసి వెళ్లిపోయిన సమాచారాన్ని కూడా నమోదు చేయాలని, ఆ రికార్డులను కనీసం ఒక సంవత్సరం పాటు భద్రపరచాలని సూచించారు. మరోవైపు విదేశీ విద్యార్థులకు ప్రవేశం కల్పించే విద్యాసంస్థలు వారి అడ్మిషన్, రాక, నిష్క్రమణ లేదా చదువు నిలిపివేత వివరాలను ఫారం ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించినా, సమాచారం దాచినా లేదా తప్పుడు వివరాలు ఇచ్చినా చట్టరీత్యా నేరమని డీసీపీ హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టంలోని సెక్షన్-23 ప్రకారం కఠినమైన శిక్షార్హ చర్యలు ఉంటాయని, గృహ యజమానులు, విద్యాసంస్థల యాజమాన్యాలు చట్టాన్ని గౌరవించి న్యాయపరమైన ఇబ్బందులను నివారించుకోవాలని గోల్కొండ జోన్ డీసీపీ పిలుపునిచ్చారు.

# వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

**మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్ మనసులో మాట :** హైదరాబాద్‌ను క్యాన్సర్, అరుదైన వ్యాధుల చికిత్సకు అవసరమైన బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ పరిశోధనలకు ప్రపంచ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సంగారెడ్డి జిల్లా బోర్పట్లలో రూ.1,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'ష్రవతీఖఅఎ దీఅశిశ్రీశ్రఖఎఓ' తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీల ద్వారా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ ప్లాంట్‌లో తయారయ్యే క్యాన్సర్ ఔషధాలను అమెరికా సహా పలు దేశాలకు ఎగుమతి చేస్తారని, దీని ద్వారా సుమారు 1,500 మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.

# ఉత్తర తెలంగాణకు భారీ రహదారి నజరానా!

- **ఏడు వేల ఐదు వందల కోట్ల కేంద్ర నిధులకు ఆమోదం**
- **జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల దారులకు మహర్దశ**
- **రవాణా రంగంలో సరికొత్త విప్లవానికి శ్రీకారం**
- **పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు కొత్త దారులు**
- **ప్రధాని మోదీ, మంత్రి గడ్కరీలకు కృతజ్ఞతలు**



**హైదరాబాద్ మనసులో మాట :**

తెలంగాణ రాష్ట్రానికి జూన్ నెల సరికొత్త శుభవార్తతో మరియు సరికొత్త ఉత్సాహంతో ప్రారంభమైంది. ఉత్తర తెలంగాణ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి అత్యంత కీలకమైన ఏడు వేల ఐదు వందల తొంభై ఏడు కోట్ల రూపాయల భారీ నిధులతో కూడిన జాతీయ రహదారి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ భారీ కేటాయింపులు రాష్ట్రానికి, ముఖ్యంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాంతానికి ఒక చారిత్రాత్మక ముందడుగుగా నిలవనున్నాయి. గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-563 జాతీయ రహదారులను నాలుగు లేన్ల (చతుర్భుజ) రహదారులుగా విస్తరించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. ఈ భారీ ప్రాజెక్టు కింద మొత్తం మూడు ప్రధాన రహదారి మార్గాలను యుద్ధప్రాతిపదికన విస్తరించనున్నారు. ఇందులో భాగంగా అరవై మూడు పాయింట్ ఆరు కిలోమీటర్ల పొడవున్న ఆర్మూర్ నుండి జగిత్యాల మార్గానికి రెండు వేల నాలుగు వందల డెబ్బై రెండు కోట్ల రూపాయలను కేటాయించారు. అలాగే అరవై ఎనిమిది పాయింట్ మూడు కిలోమీటర్ల పొడవు గల జగిత్యాల నుండి మంచిర్యాల రహదారి పనుల కోసం రెండు వేల ఏడు వందల ముప్పై ఒక్క కోట్ల రూపాయలను, యాభై ఎనిమిది పాయింట్ ఎనిమిది కిలోమీటర్ల పొడవున్న జగిత్యాల నుండి కరీంనగర్ మార్గానికి రెండు వేల మూడు వందల తొంభై ఐదు కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మూడు ప్రధాన కనెక్టివిటీ దారుల విస్తరణతో ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా రవాణా కష్టాలు తీరడమే కాకుండా ప్రయాణ సమయం కూడా భారీగా తగ్గనుంది. ఈ ప్రతిష్టాత్మక రహదారి ప్రాజెక్టు కేవలం ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచడానికే కాకుండా, ఉత్తర తెలంగాణ రీజియన్‌లో పరిశ్రమలు, వాణిజ్యం మరియు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కొత్త మైలురాయిగా నిలవనుంది. రాబోయే దశాబ్దాల కాలం పాటు తెలంగాణ ప్రగతి రథ చక్రాలకు ఇది ఒక బలమైన పునాదిగా మారుతుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును మంజూరు చేసినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఈ ప్రాంత ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ భారీ ప్రాజెక్టుతో కరీంనగర్ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోనుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# గోదావరి పుష్కరాలకు భారీ నిధులు

- **భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు**
- **బడ్జెట్లో వెయ్యి కోట్ల రూపాయల కేటాయింపు**
- **జగిత్యాల జిల్లాకు లభించిన సింహభాగం నిధులు**
- **ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాలకు మహర్దశ**
- **త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తికి ఆదేశం**
- **రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**హైదరాబాద్ మనసులో మాట :**

వచ్చే రెండు వేల ఇరవై ఏడు లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో సమకూరుస్తామని, వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే పుష్కరాల కోసం ప్రభుత్వం బడ్జెట్లో ఏకంగా వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు కేటాయించిన ఈ పుష్కరాల నిధుల్లో జగిత్యాల జిల్లాకు మొదటి విడత కింద వంద పదిహేడు పాయింట్ సున్నా ఎనిమిది కోట్ల రూపాయలను కేటాయించినట్లు మంత్రి అడ్లూరి వెల్లడించారు. మొదటి విడతగా విడుదలైన ఈ నిధుల్లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ఎనభై మూడు పాయింట్ సున్నా ఏడు కోట్ల రూపాయలను, అలాగే కోటిలింగాల క్షేత్రం కోసం ముప్పై నాలుగు పాయింట్ సున్నా ఒక్క కోట్ల రూపాయలను కేటాయించినట్లు మంత్రి వివరంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా ధర్మపురి క్షేత్రానికి నీటి పారుదల శాఖ ద్వారా ఇరవై రెండు పాయింట్ సున్నా రెండు కోట్ల రూపాయలు, రోడ్లు భవనాల శాఖ ద్వారా ఇరవై ఐదు పాయింట్ సున్నా ఎనిమిది కోట్ల రూపాయలు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇరవై ఐదు పాయింట్ సున్నా ఏడు కోట్ల రూపాయలు, దేవాదాయ శాఖ ద్వారా పది కోట్ల రూపాయలను కేటాయించినట్లు వివరించారు. అలాగే కోటిలింగాల పుణ్యక్షేత్రానికి నీటి పారుదల శాఖ ద్వారా పదహారు పాయింట్ సున్నా ఒక్క కోట్ల రూపాయలు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎనిమిది కోట్ల రూపాయలు, దేవాదాయ శాఖ ద్వారా మరో పది కోట్ల రూపాయలను మొదటి విడత కింద విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులకు సంబంధించిన పనుల టెండర్ల ప్రక్రియ అంతా త్వరలోనే పూర్తి అవుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా దేశం నలుమూలల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన వివిధ పనులకు సంబంధించిన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇంకా చేపట్టాల్సిన అదనపు పనులకు సంబంధించిన నిధుల విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి, మరిన్ని నిధులు త్వరితగతిన విడుదలయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

- కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను
- తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే
- మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ మనసులో మాట :** వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

# రైతు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో తుది దశకు వడ్ల సేకరణ
- ఉనికి చాటుకోవడానికే కొనుగోళ్లపై విపక్షాల దుష్ప్రచారం
- మూడు గంటల విద్యుత్ అంటూ కేటీఆర్ తప్పుడు ప్రచారం

**హైదరాబాద్ మనసులో మాట :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయని, రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం ఐకేపీ కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ ఆవునూరి శంకరవ్వ శంకరయ్య, వార్డు సభ్యులు ఆవునూరి కార్తీక్, కోడం రవి, గొర్రె నర్సవ్వలతో పాటు సుమారు యాభై మంది ముఖ్య కార్యకర్తలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, నియోజకవర్గంలో తాము చేపడుతున్న నిరంతర ప్రగతి పనులకు ఆకర్షితులై అనేక గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లోకి వలస వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన ఆశయమని, అందుకోసం రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడిస్తూ హన్మాజీపేట గ్రామ ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కొందరు వ్యక్తులు తమ రాజకీయ స్వార్థం కోసం, ఉనికిని చాటుకోవడం కోసం సామాజిక మాధ్యమాల్లో, బయట కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. నిన్నటి వరకు జిల్లాలో సుమారు రెండు లక్షల డెబ్బై ఐదు వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. గత యాసంగి సీజన్‌లో రెండు లక్షల అరవై తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరగ్గా, ఈసారి ఇప్పటికే గత ఏడాదికంటే ఆరు వేల మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు జరిగిందన్నారు. ఇంకా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్దకు మరో ముప్పై ఐదు వేల మెట్రిక్ టన్నుల వరి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈసారి వరి దిగుబడి గణనీయంగా పెరిగినప్పటికీ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లర్ల వద్ద, గోదాముల వద్ద ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. రైస్ మిల్లుల్లో స్థలాభావం లేదా గోదాముల్లో నిల్వ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ నిల్వ సదుపాయాలు కల్పించి ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలని ముఖ్యమంత్రి ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను, పుకార్లను రైతులు, ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ తిరుపతిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తీగల ఎల్లయ్య గౌడ్, ఆత్మ కమిటీ మెంబర్ చెన్నాడి శ్యామల, జిల్లా డిసిసి కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, చెన్నాడి గోవర్ధన్ రెడ్డి, చిలక ప్రభాకర్, మర్రిపల్లి మల్లేశం, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను ఉద్యమంలా నిర్వహించాలి

**ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగిత రానా ఐఏఎస్ దిశానిర్దేశం**

**FLN అమలులో నారాయణపేట జిల్లా ప్రగతిపై పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ప్రశంసలు**

**నారాయణపేట, జూన్ 03 (మనసులో మాట):** ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రానా ఐఏఎస్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి ఆమె నిర్వహించిన ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఐఏఎస్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఐఏఎస్ పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా తరఫున మక్తల్ తహసీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక ఐఏఎస్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగిత రానా మాట్లాడుతూ.. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బడిబాట కార్యక్రమాన్ని తండాలు, గూడెల స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించాలన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా 'జీరో ఎన్రోల్మెంట్' ఉన్న పాఠశాలలను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, నూతనంగా మంజూరైన ప్రీ-ప్రైమరీ విభాగాలను జూన్ 12 నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాల్లా వంటి డిజిటల్ లెర్నింగ్ వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. కాగా, గత విద్యా సంవత్సరంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఖీూచీ) కార్యక్రమం అమలులో నారాయణపేట జిల్లా సాధించిన అద్భుత ప్రగతిని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ.. జిల్లాలో బడిబాటను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పంపిణీకి సర్వం సిద్ధం చేశామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) డా. ఎం. గోవిందరాజులు, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి కృషి



**హైదరాబాద్ (జూన్ 3)(మనసులో మాట)** పీసీఆర్, అట్రాసిటీ చట్టాల కింద నమోదైన కేసుల త్వరిత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అట్రాసిటీ కేసుల కుల ధ్రువీకరణ పత్రాలను త్వరగా జారీ చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సీపీ శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి కోటజి, కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, ఏసీపీలు పాల్గొన్నారు.

# పట్టుబడిన ద్విచక్ర వాహనదారులు ఎక్కడ?

### ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు



**ఎల్బీనగర్, జూన్ 3 ( మనసులో మాట):** ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడిన 116 వాహనాలు పోలీసుల ఆధీనం లోనే ఉన్నాయని, వాటికి సంబంధించిన పత్రాలను చూపించి, పెండింగ్ చలానాలు చెల్లించి తీసుకువెళ్లాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అవి పట్టుబడినప్పటి నుండి ఇప్పటివరకు, ఆ వాహనాల యజమానులు వాటి మీద చలానాల రూపంలో ఉన్న జరిమానాలను చెల్లించి తీసుకొని పోలేదని, సదరు వాహన యజమానులకు పోస్ట్ ద్వారా నోటీసులు, సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు వాహనదారులు ముందుకు వచ్చి పైన తెలుపబడిన వారి వాహనాలను తీసుకుపోవుటకు రాలేదు, చివరి ప్రయత్నం గా ప్రింట్, ఎల్రక్టానిక్, సోషల్ మీడియా ల ద్వారా తెలియ చేస్తున్నామని ఇన్స్పెక్టర్ అన్నారు. వాటి యజమానులు స్టేషన్ కి వచ్చి వారి వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు చూపించి, వాటిపై పెండింగ్ లో ఉన్న జరిమానాలను చెల్లించి, తీసుకెళ్లగలరని కోరారు. లేని పక్షంలో చట్ట ప్రకారం, నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందని, సదరు వాహన యజమానులకు తెలియపరుస్తున్నామని మీడియా సమావేశంలో తెలిపారు. ఇతరత సమాచారం కోసం 8712662773 సంప్రదించగలరని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ

### త్వరలో సందర్శించనున్న సీఎం

### పూర్తి కావొచ్చిన ఎఫ్‌సిడిఏ, స్కిల్ యూనివర్శిటీ భవనాలు పెట్టుబడుల గమ్య స్థానంగా నాల్గో పట్టణం

### కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**రంగారెడ్డి జూన్ 3 (మనసులో మాట):** ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలో ఉన్న అతిపెద్ద కంపెనీ లన్నీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. రెండు, మూడు రోజులలో సీఎం రేవంత్ రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శిస్తారని చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ (ఎఫ్ సీడీఏ), స్కిల్ యూనివర్శిటీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. హైదరాబాద్ పై ఒత్తిడి తగ్గించి, రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక సౌకర్యాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. స్కిల్ యూనివర్శిటీ ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డెవలప్ మెంట్ అథారిటీ ద్వారా పనులు వేగవంతమై... నగర అభివృద్ధి త్వరగా జరుగుతుందన్నారు లక్ష్మారెడ్డి. మహేశ్వరం నియోజకవర్గంలో ఏర్పాటు అయిన ఫ్యూచర్ సిటీ... గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందనుందని కేఎల్ఆర్ సంతోషం వ్యక్తం చేశారు.

# నిజామాబాద్ వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ పదవిపై చర్చ

- పదవీకాలం, నియామక ప్రక్రియపై స్పష్టత కోసం ప్రజల డిమాండ్
- కార్యకలాపాల్లో పారదర్శకత పాటించాలని సామాజిక వర్గాల కోరిక





**నిజామాబాద్, జూన్ 3, (మనసులో మాట):** నిజామాబాద్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్‌గా మాయవర్ రాజేశ్వర్ గత దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్నారనే అంశం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు, కమిటీ సభ్యులు లేదా వివిధ పదవుల్లో ఉన్న వ్యక్తులకు నిర్దిష్ట కాలపరిమితి, పదవీకాలం లేదా రిటైర్మెంట్ నిబంధనలు అమలులో ఉంటాయి. అయితే వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ పదవికి సంబంధించి ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయి, పదవీకాల పరిమితి ఎంత, నియామక ప్రక్రియ ఎలా జరుగుతుంది అనే విషయాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. మాయవర్ రాజేశ్వర్ సుమారు 18 నుంచి 20 సంవత్సరాలుగా చైర్మన్‌గా కొనసాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నియామకం ఏ సంవత్సరంలో జరిగింది, ఎవరి ద్వారా జరిగింది, పదవీకాలం ఎంత, ఇప్పటివరకు ఎన్ని సార్లు పదవీకాలం పొడిగించబడింది వంటి వివరాలను అధికారికంగా వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ద్వారా ఇప్పటివరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చేపట్టిన చర్యలు, ప్రజలకు అందించిన సేవలు, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను కూడా బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్ పరిధిలో నిర్వహించే పలు జయంతి, వర్ధంతి, ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు మరియు ఇతర అధికారిక వేడుకల్లో మాయవర్ రాజేశ్వర్ తరచుగా పాల్గొనడం వెనుక ఆయన అధికారిక బాధ్యతలు ఏమిటనే అంశంపైనా చర్చ సాగుతోంది. జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనడం వినియోగదారుల సమాచార కేంద్రం పరిధిలో భాగమేనా, లేక ప్రత్యేక అధికారిక బాధ్యతలున్నాయా అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో వినియోగదారుల సమాచార కేంద్రానికి లేదా చైర్మన్‌కు కేటాయించిన కార్యాలయ గది, దాని నిర్వహణ, ఖర్చుల భారం ఏ శాఖ భరిస్తోంది, కేంద్రం కార్యకలాపాలకు నిధులు ఎలా సమకూరుతున్నాయి, వాటి వినియోగంపై ఆడిట్ జరుగుతోందా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజాధనంతో నడిచే ఏ సంస్థ అయినా తన కార్యకలాపాలపై పూర్తి పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి వినియోగదారుల సమాచార కేంద్రాలు ఉన్నాయా, అక్కడి చైర్మన్ల నియామక విధానం ఎలా ఉంది, వారి పదవీకాలం ఎంత, ఏ నిబంధనల ప్రకారం కొనసాగుతున్నారు అనే అంశాలను ప్రభుత్వం స్పష్టంచేయాలని కోరుతున్నారు. ఒకవేళ ఈ పదవి స్వచ్ఛంద సేవా సంస్థ లేదా ప్రభుత్వ అనుబంధ వ్యవస్థకు చెందినదైతే, దానికి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, బాధ్యతలు, పదవీకాల పరిమితిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లేదా సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, వినియోగదారుల సమాచార కేంద్రం కార్యకలాపాలు, చైర్మన్ నియామక ప్రక్రియ, పదవీకాలం, ఆర్థిక వ్యవహారాలు, ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని ప్రజల్లోని కొందరు కోరుతున్నారు. అయితే ఈ అంశాలపై అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు ప్రభుత్వం లేదా సంబంధిత శాఖలు ఎలాంటి వివరణ ఇస్తాయో వేచి చూడాల్సి ఉంది.

# స్వాతి రెసిడెన్సీ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**ఎల్బీనగర్, జూన్ 3 ( మనసులో మాట)** ఎల్బీనగర్ నియోజకవర్గం లోని మన్సురాబాద్ డివిజన్, స్వాతి రెసిడెన్సీ కాలనీలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం స్వాతి రెసిడెన్సీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన యూ.జీ.డీ. ఇంటర్నల్ పైప్‌లైన్ వ్యవస్థల కారణంగా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి వలన స్థానిక నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. కాలనీ పార్క్ ప్రహరీ గోడ, జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకోనిరావాలని కోరారు. కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజల సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన్సురాబాద్ డివిజన్ భారస పార్టీ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, స్వాతి రెసిడెన్సీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమనాథ్, ఉపాధ్యక్షులు భాస్కర్ గౌడ్, వరుణ్, సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ప్రైవేట్ విద్యా సంస్థల నిలువు దోపిడీ

- అధిక ఫీజుల వసూళ్లను అడ్డుకోవాలని మాజీ కార్పొరేటర్ డిమాండ్
- టీసీల జారీలో ఇబ్బందులు పెడితే ఊరుకునేది లేదు: కొప్పుల నర్సింహ్మ రెడ్డి



**ఎల్బీనగర్, జూన్ 3 (మనసులో మాట):** హైదరాబాద్ ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ బీజేపీ కార్యాలయం లో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మధ్య తరగతి కుటుంబాల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం నాయకులు పొట్లపల్లి సాయిరాం గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు పారంద సాయి లతో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు భరించలేక తమ పిల్లలను ఇతర విద్యాసంస్థల్లో చేర్పించాలని నిర్ణయించుకున్న తల్లిదండ్రులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీ లు) ఇవ్వాలని కోరినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు వాటిని జారీ చేయకుండా అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు.

"విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు" దానిని వ్యాపారంగా మార్చి పెద్ద పెద్ద "బ్రాండ్స్" పేరుతో అధిక ఫీజులు వసూళ్లు. తల్లిదండ్రులపై అధిక భారం మోపడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడం తో పాటు, విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా టీసీ లు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క ప్రైవేట్ పాఠశాల లలో విద్యనే వ్యాపారం చేస్తున్నారని అనుకుంటే? యూనిఫామ్స్, బుక్స్, నోటు బుక్స్, ఇతర స్కూలుకు సంబంధించిన మెటీరియల్స్ పేరు చెప్పి వారు చెయ్యని వ్యాపారం లేదు? విద్యతో పాటు ప్రతి దాన్ని వ్యాపారంగా మార్చిన ప్రవేటు విద్యా సంస్థలు ప్రతి విద్యార్థి దగ్గర నుండి వేలకు వేలు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై ఎంఈఓ, డీఈవో, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పందించడం లేదు, ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

నగరంలో స్కూల్ బ్రాండ్ల పేరుతో ప్రతి సంవత్సరం వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల నుండి రూపాయలు 2000/- నుండి రూపాయలు 3000/- వరకు వసూలు చేసి వారి స్కూల్ బ్రాండ్ ను పబ్లిసిటీ చేసేందుకు పిల్లల వద్ద నుండి డబ్బులు తీసుకునే నియమాలు ఎక్కడివి? అని డిమాండ్ చేస్తూ వీటిపై వెంబడే సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో ప్రతి విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి మా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఘట్కేసర్ డివిజన్ సమస్యలపై కమిషనర్‌కు మాజీ సర్పంచ్ ఫిర్యాదు

- HRDCL రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం
- ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారుల తీరుపై ఆగ్రహం





**మేడ్చల్ జిల్లా, జూన్ 03,( మనసులో మాట):** ఘట్కేసర్ డివిజన్ 6 పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రధాన సమస్యలు:

రోడ్డు పనుల్లో జాప్యం: శివారెడ్డిగూడ ఎక్స్ రోడ్ నుండి మాధవరెడ్డి వంతెన వరకు ఎ=ణజూ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు పనులు



చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. 100 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ (ఝఅఎ ాూఎనబఱంఞఱశీఅ) చేయడంలో, నోటీసులు ఇవ్వడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిర్వహణ లోపాలు: రోడ్డు మార్గంలో ఉన్న మ్యాన్‌హోల్స్, పైప్‌లైన్ల రిపేర్లు చేయకుండా కాంట్రాక్టర్ మరియు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రారంభం కాని పనులు: గత మూడు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, నారాయణ గార్డెన్ నుండి లక్కు వైన్స్ - ఎదులాబాద్ రోడ్డు వరకు సాంక్షన్ మరియు టెండర్ పూర్తయిన పనులను ఇంకా ప్రారంభించలేదు. ప్రజల ఇక్కట్లు: ఘట్కేసర్ డివిజన్ 6 ప్రజలు ఈ సమస్యల వల్ల ప్రత్యక్ష నరకం చూస్తున్నారని, అధికారులు ప్రజల బాధలను తీర్చడంలో తీవ్ర అలసత్వం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ఘట్కేసర్ రైల్వే వంతెన వద్ద ఉన్న రోడ్డు సమస్యతో పాటు, డివిజన్ పరిధిలోని అన్ని అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, కమిషనర్ వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మారం లక్ష్మారెడ్డి, పొట్లచెరువు శ్రీరాములు, నజీర్, అహ్మద్, మణిక కుమార్, సారా శ్రీనివాస్ గౌడ్, కెఫా, శివరాత్రి సురేష్, తన్నీర్ హరీష్, సుబ్బారావు, శివశంకర్, సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగం నిషేధించండి

**డీఎఫ్ఓ బాలమణి**



**సిర్పూర్ జూన్ 3, మనసులో మాట ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, సిర్పూర్ (టి) మండలంలోని దుబ్బగూడ గ్రామంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అటవీ అధికారి శ్రీమతి సి.హెచ్. బాలమణి, ఏసీఎఫ్/ఎఫ్‌డీఓ ఏ. అప్పయ్య, సిర్పూర్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, డీవైఆర్ఓ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎస్ఓ మోహన్ మరియు అటవీ శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు మరియు మానవ ఆరోగ్యానికి కలిగే హానికర ప్రభావాల గురించి అధికారులు గ్రామస్థులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వస్త్ర సంచులు వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని వారు సూచించారు. దుబ్బగూడ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చురుకుగా పాల్గొని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# బోయకొండ అటవీ ప్రాంతంలో జాయింట్ సర్వే

**నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ వివరాలు ఇక్కడ ఉన్నాయి:**

**జాయింట్ సర్వే కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**చౌడేపల్లి, జూన్ 3, (మనసులో మాట):** నియోజకవర్గంలోని బోయకొండ అటవీ ప్రాంతంలో అటవీ సరిహద్దులు మరియు బఫర్ జోన్ ఏర్పాటుపై జాయింట్ సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు.

### కమిటీ మరియు సర్వే వివరాలు:

కమిటీ సభ్యులు: ఈ కమిటీలో సబ్ కలెక్టర్, మైనింగ్ ఏడి, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ మరియు వివిధ శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. సర్వే ఉద్దేశ్యం: చౌడేపల్లి, పుంగనూరు మండలాల సరిహద్దుల్లో ఉన్న బోయకొండ అటవీ ప్రాంతం మరియు బఫర్ జోన్‌లను జాయింట్ సర్వే చేసి, సరిహద్దులను ఖరారు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. సమావేశం: ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి బుధవారం చౌడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారి థామస్, ఎఫ్ఎస్ఓ అనీల్ కుమార్, చౌడేపల్లి తహసీల్దార్ పార్వతి, పుంగనూరు తహసీల్దార్ రాము మరియు మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# సోషల్ మీడియాలో బీఎల్ఎఫ్ నేత

## పారిశుద్ధ్య కార్మికుడి మధ్య మాటల యుద్ధం.. అధికారుల దృష్టికి చేరిన వివాదం



**నిజామాబాద్, జూన్ 03 (మనసులో మాట)** : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) నేత, తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ కమిటీ కన్వీనర్ మరియు ఓ పారిశుద్ధ్య కార్మికుడి మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేయడంతో ఈ వ్యవహారం ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

కార్మికుల హక్కుల పరిరక్షణ పేరుతో పనిచేస్తున్న కొందరు నేతలు వాస్తవానికి కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నారని సంబంధిత పారిశుద్ధ్య కార్మికుడు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అక్రమాలు, అవినీతి వ్యవహారాలపై ప్రశ్నించాల్సిన నాయకులు వాటిని పట్టించుకోకుండా తమ స్వప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు.

అదే సమయంలో కొందరు కార్మికులు విధులకు హాజరు కాకపోయినా హాజరైనట్లు రికార్డుల్లో చూపించడం, ఉద్యోగాలు లేదా ఇతర పనులు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్మిక వర్గాల్లో చర్చకు దారి తీశాయి.

మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను సంబంధిత బీఎల్ఎఫ్ నేత ఖండిస్తున్నట్లు సమాచారం. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తాను నిరంతరం పోరాటం చేస్తున్నానని, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో ప్రారంభమైన ఈ వివాదం ఇప్పుడు అధికారిక ఫిర్యాదుల దశకు చేరుకుంది. ఇరువర్గాలు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై అధికారుల దృష్టి సారించినట్లు సమాచారం. ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందో తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ పేరుతో జరుగుతున్న కార్యకలాపాలపై పూర్తి పారదర్శకత ఉండాలని అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉండగా, ఈ వివాదం కార్మిక సంఘాల అంతర్గత విభేదాలకు దారితీస్తుందా? లేక అధికారుల విచారణతో అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు, ఫిర్యాదులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనే అంశాలపై ప్రస్తుతం కార్మిక వర్గాలతో పాటు ప్రజల దృష్టి కూడా కేంద్రీకృతమైంది.

# జూన్ 10లోగా పాఠశాలల మరమ్మతులు పూర్తి చెయ్యాలి

**జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్.**



**నల్లగొండ,జూన్ 03,(మనసులో మాట):** విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అన్ని మరమ్మతు పనులను జూన్ 10లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ఆర్‌సీఓలు, సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బడిబాట కార్యక్రమం ఏర్పాట్లు, NRGES నిధుల వినియోగం, పాఠశాల భవనాల మరమ్మతులు, పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాల సౌకర్యాలు, కేజీబీవీలలో పెండింగ్ పనులు, విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ, సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు, పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను పూర్తిచేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలలు, తాగునీటి సౌకర్యాల కల్పన, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాంలను అందజేయాలని, వాటి కుట్టు పనులను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో బియ్యం నిల్వలు, వంటశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్, తరగతి గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యుత్, ప్లంబింగ్ వ్యవస్థలను పూర్తిగా తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. పాఠశాలల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని, జీరో అడ్మిషన్లు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి నమోదు సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు. జూన్ 12లోపు విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందించాలని ఆదేశించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు ఏఐ ఆధారిత తరగతులు నిర్వహించాలని, పాఠశాలలలోనే ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ పబ్లిక్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి దశరథ, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పిడి శేఖర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లైన్‌మెన్ కుటుంబానికి రూ కోటి బీమా చెక్కు అందజేత

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా పంపిణీ**

**హైదరాబాద్, జూన్ 3, (మనసులో మాట):** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎస్పీడీసీఎల్ లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ. 1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో బుధవారం అందజేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేసిన ప్రమోద్ కుమార్ 2025 మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎస్పీడీసీఎల్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం, ఖూరాా-2, ఖూరాా-3 శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు రూ. 1 కోటి వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ పథకం కింద మృతుడి భార్య, నామినీ అయిన సోన్కాంబ్లే స్వప్న దాఖలు చేసిన క్లెయిమ్‌ను పరిశీలించిన బ్యాంకు అధికారులు రూ. 1 కోటి బీమా మొత్తాన్ని మే 30న ఆమె ఖాతాలో జమ చేశారు. అనంతరం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమెకు బీమా చెక్కును అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం, బ్యాంకింగ్ సంస్థల నిబద్ధతకు ఈ ఘటన నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంక్ సీఈవో ఆశిష్ పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమరేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుపై అఖిలపక్ష సమావేశం

**ఈనెల 4న సచివాలయంలో కీలక భేటీ**

**హైదరాబాద్, జూన్ 2, ((మనసులో మాట):** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని సముచిత రీతిలో గౌరవించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, ఈనెల 4వ తేదీన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశం డా. బీ.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తు, రూమ్ నెంబర్ 33లో నిర్వహించబడుతుంది. సమావేశం 4వ తేదీ ఉదయం 11:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ భేటీలో పాల్గొని తమ విలువైన సలహాలు, అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు గాను, ప్రతి రాజకీయ పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులను నామినేట్ చేయాలని ప్రభుత్వం కోరింది. ప్రతినిధులు సచివాలయంలోకి ప్రవేశించేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ముందస్తుగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి దేవీదాస్ (ఫోన్ నెంబర్: 87126 66004) గారిని సంప్రదించాలని అధికారికంగా పేర్కొన్నారు.

# రెసోనెన్స్ అకాడమీ ప్రచారానికి వస్తే అడ్డుకుంటాం

**మాజీ ఐపీఎస్ లక్ష్మీనారాయణ పర్యటనపై ఏఐఎఫ్‌బీ హెచ్చరిక**



**కరీంనగర్ టౌన్, జూన్ 3, (మనసులో మాట):** కరీంనగర్‌లో అనుమతులు లేని రెసోనెన్స్ అకాడమీ ప్రచారానికి వస్తున్న మాజీ ఐపీఎస్ లక్ష్మీనారాయణను అడ్డుకుంటామని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ హెచ్చరించారు. అకాడమీ ప్రారంభోత్సవం జరగనున్న హోటల్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. అనుమతులు లేని విద్యాసంస్థల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధమైన అకాడమీలకు ప్రచారం చేయడం సరైనది కాదని స్పష్టం చేశారు.

# ఇంటికో మొక్క నాటాలని ప్రజలకు పిలుపు

- పర్యావరణ పరిరక్షణకు బైక్ ర్యాలీ
- గజ్వేల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**గజ్వేల్, జూన్ 3, (మనసులో మాట):** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వాసవి క్లబ్ సభ్యులు మరియు అటవీ శాఖ సంయుక్తంగా గజ్వేల్ పట్టణంలోని ఆర్‌ఆర్ కాలనీలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించాయి. ఈ ర్యాలీని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న వారు ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణ మరియు అడవి జంతువుల సంరక్షణపై నినాదాలు చేస్తూ ప్రజలలో చైతన్యం నింపారు.

**ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు.**



ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు సహకరించాలని, అలాగే చైనా మాంజా వినియోగాన్ని నియంత్రించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్య, శేఖర్, డీఆర్‌ఓ రాజమణి, ఫారెస్ట్ ట్రైనింగ్ ఆఫీసర్ షకావత్ హరిప్రసాద్, బీట్ అధికారులు కిషోర్, రాజు, స్వామి, ఐలయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తీలేరులో ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం

- పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీ
- క్రీడా కార్యక్రమాలతో ఉత్సాహంగా యువత



**నారాయణపేట, జూన్ 3, (మనసులో మాట):** నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని తీలేరు గ్రామంలో బుధవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా 'మై భారత్' ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ మరియు క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలు నాటి, హరిత సందేశాన్ని అందించారు. నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె. ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై, సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్ వినియోగం ఆరోగ్యకరమైన జీవన విధానానికి మరియు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని కె. ప్రశాంత్ పేర్కొన్నారు. యువత క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ, రోజువారీ వ్యాయామానికి సమయాన్ని కేటాయించాలని ఆయన సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను కలిగిస్తాయని ఆయన వివరించారు. అనంతరం, కె. ప్రశాంత్ యువకులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్ గౌడ్, నరేష్ గౌడ్, జగదీష్ గౌడ్, అప్పంపల్లి సర్పంచ్ అనిల్ రెడ్డి, తీలేరు ఉపసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, యూత్ నాయకులు శీను, గ్రామ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

- ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి పొందే అవకాశం: పి. సునీత

జగిత్యాల ఆర్.సెటిలో మహిళలకు ఎంబ్రాయిడరీ శిక్షణ

**జగిత్యాల టౌన్, జూన్ 3, (మనసులో మాట):** జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (=ాజు×)లో మహిళల కోసం నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ శిక్షణ తరగతులను సెర్ప్ (ాజు=ా) అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ పి. సునీత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు శిక్షణ యొక్క ప్రాముఖ్యతను మరియు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.

**శిక్షణ మరియు ఆర్థిక ప్రోత్సాహకాలు:**

యూనియన్ బ్యాంక్ సహకారంతో ఆర్.సెటి కేంద్రంలో నిపుణుల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు వివిధ రంగాలలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా ఉపాధి యూనిట్లను నెలకొల్పుకునేందుకు, బ్యాంకుల ద్వారా అవసరమైన రుణాలు అందేలా



ప్రోత్సహిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్. రమేష్, డైరెక్టర్ యం. బాపు, జిల్లా ఆపియం, శిక్షణ కేంద్రం డైరెక్టర్ ఎపియం వి. గంగాధర్, శిక్షకులు, సిబ్బంది మరియు వివిధ మండలాల నుండి వచ్చిన శిక్షణార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**'స్వచ్ఛ గ్రామం - సురక్షిత జలవాయు' కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం**

**ఐడీఓసీ కార్యాలయంలో ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరణ**



**భూపాలపల్లి, జూన్ 3, (మనసులో మాట):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న 'స్వచ్ఛ గ్రామం – సురక్షిత జలవాయు' కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో డీఆర్‌డీఏ రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే రోజువారీ కార్యాచరణలను జిల్లాలోని అన్ని మండలాల్లో మరియు గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రభుత్వ యంత్రాంగం మరియు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అమలులోకి వచ్చిన 2026 నూతన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ప్రతి గ్రామ పంచాయతీలోనూ తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు వ్యర్థాలను ఈ క్రింది విధంగా వేరు చేయాలని నిర్దేశించారు: పర్యావరణహిత పద్ధతుల్లో వీటిని నిర్వహించడం ద్వారా గ్రామాలను మరింత పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, ప్లాస్టిక్ రహిత గ్రామాల దిశగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్‌డీఓ బాలకృష్ణ, డీపీఓ శ్రీలత, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్ వెంకటేష్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాట్రేవుపల్లిలో ఎత్తిపోతల పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట, జూన్ 3, (మనసులో మాట):** నారాయణపేట , కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం పరిశీలించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఏరియల్ సర్వే నేపథ్యంలో, ప్రాజెక్టు పనుల పురోగతిని మంత్రి వాకిటి శ్రీహరి పర్యవేక్షించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కాట్రేవుపల్లి గ్రామంలో జరుగుతున్న ప్రాజెక్టు పనులను పరిశీలించారు.



# భూ తగాదాల్లో సెటిల్‌మెంట్లు చేసేవారికి "కౌన్సిలింగ్" ఇవ్వండి

**రౌడీ షీటర్ల పట్ల కఠినంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశం**



**హన్మకొండ, జూన్ 3,(మనసులో మాట):** భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే రౌడీ షీటర్లకు కఠినంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కెయూసి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ రికార్డులు మరియు రౌడీ షీటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రౌడీ షీటర్లపై నిఘా: పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారి పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ సానుభూతి ప్రదర్శించవద్దని కమిషనర్ స్పష్టం చేశారు. కౌన్సిలింగ్: తగాదాల్లో తలదూర్చి బెదిరింపులకు పాల్పడే వారిని పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్: స్థానిక సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. అవగాహన కార్యక్రమాలు: విద్యా సంస్థల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు మరియు ట్రాఫిక్ నిబంధనలపై ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సెక్టార్ వారీగా పర్యవేక్షణ: ఎస్.ఐలు తమకు కేటాయించిన సెక్టార్ పరిధిలో నేరాలను నియంత్రించడంతో పాటు, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ స్టేషన్ పరిసరాలు, స్టోర్ గదులు, కేసు ప్రాపర్టీలు మరియు బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమార్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా వెంకటరమణ

**సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సీపీ ఆదేశం**

**హన్మకొండ, జూన్ 3,( మనసులో మాట):** వరంగల్ సైబర్ పోలీస్ స్టేషన్ నూతన డిఎస్పీగా ఎం. వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, సైబర్ ఫిర్యాదుల పట్ల సిబ్బంది తక్షణమే స్పందించాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల దృష్ట్యా ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన డిఎస్పీని ఆదేశించారు. ఇదిలా ఉండగా, గతంలో ఇక్కడ సైబర్ క్రైమ్ డిఎస్పీగా పనిచేసిన కె. గిరికుమార్ మహబూబ్ నగర్ సైబర్ క్రైమ్ డిఎస్పీగా బదిలీ అయ్యారు

# జిల్లా విద్యాధికారి రామును సన్మానించిన పిఆర్టీయుటిఎస్ నాయకులు

- బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన 126 మంది విద్యార్థులు
- రాష్ట్రంలో జగిత్యాల జిల్లాకు రెండో స్థానం దక్కడంపై హర్షం

**జగిత్యాల టౌన్, జూన్ 3,(మనసులో మాట):** 2026 ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జగిత్యాల జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లాకు చెందిన 126 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి, తెలంగాణ రాష్ట్రంలోనే జిల్లాను రెండో స్థానంలో నిలిపారు. ఈ అద్భుతమైన ఫలితాలకు కృషి చేసిన జిల్లా విద్యాధికారి కె. రామును పిఆర్టీయుటిఎస్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పిఆర్టీయుటిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపల్లి ఆనంద్ రావు మరియు యాళ్ళ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



# పుష్కరాలకు అవసరమైన నిధులు సమాకురుస్తాం

- ఎక్కడా అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- జగిత్యాల జిల్లాకు రూ. 117.08 కోట్లు కేటాయింపు



**జగిత్యాల టౌన్, జూన్ 3, (మనసులో మాట):** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు ఆయా శాఖల అధికారులతో కలిసి ఆయన పుష్కరాల పనులపై చర్చించారు.

**పుష్కరాల నిధులు - కేటాయింపుల వివరాలు:**

గోదావరి పుష్కరాల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించగా, అందులో జగిత్యాల జిల్లాకు రూ. 117.08 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మొదటి విడతలో ధర్మపురి అభివృద్ధి పనులకు రూ. 83.07 కోట్లు మరియు కోటిలింగాలకు రూ. 34.01 కోట్లు కేటాయించబడ్డాయి. ధర్మపురిలో ఇరిగేషన్ శాఖకు రూ. 22.02 కోట్లు, రోడ్లు-భవనాల శాఖకు రూ. 25.08 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ. 25.07 కోట్లు మరియు దేవాదాయ శాఖకు రూ. 10 కోట్లు కేటాయించారు. కోటిలింగాల కోసం నీటి పారుదల శాఖకు రూ. 16.01 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ. 8 కోట్లు, దేవాదాయ శాఖకు రూ. 10 కోట్లు విడుదలయ్యాయని మంత్రి వివరించారు.

**అధికారులకు ఆదేశాలు:**

పనులకు సంబంధించిన టెండర్లు త్వరలోనే పూర్తవుతాయని, భక్తుల సౌకర్యం కోసం చేపట్టాల్సిన పనులను అంచనా వేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు అవసరమైన మరిన్ని నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి విడుదలయ్యేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# అమెరికాలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణికి కారు ప్రమాదం

- ప్రమాదంలో డాక్టర్ సుచి యాష్కీకి గాయాలు

**ఎల్బీనగర్, జూన్ 3 ( మనసులో మాట):** మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి ఎండోక్రినాలజిస్ట్, సీనియర్ డాక్టర్ సుచి యాష్కీకి అమెరికాలో కారు ప్రమాదం జరిగిందని విశ్వసనీయ సమాచారం. తమ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కిని బోస్టన్ లోని హార్వర్డ్ యూనివర్సిటీ అనుబంధ హాస్పిటల్ లో ఎండి కోర్సులో జాయిన్ చేసి తిరుగు ప్రయాణంలో న్యూయార్క్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వర్షం కారణంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచి యాష్కికి





రిబ్స్ విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మధుయాష్కి గౌడ్ కూడా ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. డాక్టర్ గగన యాష్కి న్యూయార్క్ మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా కాన్వొకేషన్ వేడుకకు హాజరయ్యేందుకు ఇటీవల ఆయన అమెరికా వెళ్లారు. కుమార్తెను ఎండి కోర్సులో జాయిన్ చేసే క్రమంలో లగేజీ ఎక్కువ ఉన్న క్రమంలో డాక్టర్ సూచి, మధుయాష్కి వేర్వేరు కార్లలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా రేపు ఆయన ఇండియాకు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగిందని సమాచారం.

# మహిళా ఆర్థిక సాధికారతకు మరో ముందడుగు

- మడికొండలో రూ. 1.50 కోట్లతో మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన

**హన్మకొండ, జూన్ 3, (మనసులో మాట):** మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించే లక్ష్యంతో, హనుమకొండ జిల్లా మడికొండ మహిళా ప్రాంగణంలో రూ. 1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్'కు బుధవారం శంకుస్థాపన జరిగింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



### మహిళలే యజమానులు - ప్రభుత్వ లక్ష్యం:

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మహిళలను కేవలం పథకాలకు లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా, స్వయం ఉపాధి కల్పించే యజమానులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాలు వివిధ రంగాల్లో ఇప్పటికే అద్భుతాలు సృష్టిస్తున్నాయని, ఈ పెట్రోల్ బంక్ నిర్వహణలో కూడా వారు ఆదర్శంగా నిలుస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆర్థిక స్వయంప్రతిపత్తికి బాటలు:

ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, మహిళా సంఘాల ఆదాయ వనరులను విస్తరించడంలో ఈ పెట్రోల్ బంక్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### అదనంగా ఆర్థిక భరోసా:

ఈ కార్యక్రమంతో పాటు, ఐనవోలు ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఫ్రీూ) ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహిళా సభ్యులకు ఎంపీ, ఎమ్మెల్యే మరియు కలెక్టర్ సంయుక్తంగా ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో మహిళలు మరింత వృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్, బీపీసీఎల్ ఎండి సుధీర్, ఐకెపీ రీజినల్ కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం
- జూన్ 4న సాగునీటి ప్రాజెక్టులపై ఏరియల్ సర్వే నిర్వహించనున్న ముఖ్యమంత్రి





**నారాయణపేట, జూన్ 3, (మనసులో మాట):** నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ధ్యేయమని రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. జూన్ 4న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో, మంత్రి తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

### ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే - కీలక ప్రాజెక్టులు:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 4న మక్తల్ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులపై ఏరియల్ సర్వే చేయనున్నారని మంత్రి వెల్లడించారు. కృష్ణా నదిపై కొల్పూర్-కొర్తికొండ వద్ద 1.8 టీఎంసీ సామర్థ్యంతో బ్రిడ్జి కం బారేజ్, మురారి దొడ్డి-గంజిపల్లి, దేవసూగురు వద్ద బ్రిడ్జి కం బారేజ్‌లకు ఏరియల్ సర్వే జరగనుంది. భీమా నదిపై సుకుర్ లింగంపల్లి, కుసుముర్తి వద్ద కూడా బ్రిడ్జి కం బారేజ్‌లకు సీఎం ఏరియల్ సర్వే నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. ఈ బ్యారేజీల నిర్మాణం ద్వారా తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో సాగు, తాగునీటి సమస్యలు తీరుతాయని, ప్రాజెక్టుల వల్ల రెండు రాష్ట్రాలకు సమాన ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

### అభివృద్ధి పనులు:

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ. 5 వేల కోట్లతో నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం రూ. 175 కోట్లు మంజూరు చేసిందని, దీని ద్వారా 13 గ్రామాల్లోని సుమారు 7,500 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సీఎంను స్వాగతించాలని మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

'స్వచ్ఛ గావ్ - సురక్షిత జలవాయు' కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి



**(పెద్దపల్లి, జూన్ 3, మనసులో మాట):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'స్వచ్ఛ గావ్ – సురక్షిత జలవాయు' కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. జూన్ 5వ తేదీ వరకు గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయాల్సిన కార్యక్రమాలపై ఆయన పలు సూచనలు చేశారు: ఘన వ్యర్థాల నిర్వహణ మరియు బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించడంపై దృష్టి సారించాలి. మొక్కలు నాటడం మరియు పరిశుభ్రత కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలి. పర్యావరణ అంశాలపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. 'మిషన్ లైఫ్' (జీవనశైలి మార్పు) కింద ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి. వ్యర్థాల తగ్గింపు మరియు నీటి సంరక్షణ పద్ధతులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

# గజ్వేల్‌లో బీజేపీకి షాక్

## జనసేనలో చేరిన కమ్మరి శ్రీనివాస్

పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేత



**గజ్వేల్, జూన్ 3, (మనసులో మాట):** గజ్వేల్ పట్టణానికి చెందిన బీజేపీ నేత, టెలికం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీనివాస్ (శీను) బీజేపీకి రాజీనామా చేసి, జనసేన పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. వ్యక్తిగత కారణాలతో బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం:

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో జరిగిన భేటీలో తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతంపై చర్చించినట్లు శ్రీనివాస్ వెల్లడించారు. పార్టీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని, రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే దిశగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పవన్ సూచించినట్లు తెలిపారు.

### ప్రజా సమస్యలపై పోరాటం:

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ముఖ్యంగా రైతుల ఇబ్బందులపై కార్యకర్తలు ముందుండి పోరాడాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారని శ్రీనివాస్ పేర్కొన్నారు. పవన్ సిద్ధాంతాలకు, ప్రజా సేవా దృక్పథానికి ఆకర్షితుడై తాను జనసేనలో చేరానని, సిద్దిపేట జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని మరికొందరు అసంతృప్త బీజేపీ నేతలు కూడా త్వరలోనే జనసేనలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

# సెక్రటేరియట్ వద్ద దంపతుల ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- తమ భూమి విషయంలో అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదని భార్యభర్తల ఆవేదన..
- దంపతులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు..



సెక్రటేరియట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన దంపతులు కృష్ణయ్య, సాయమ్మ లను విచారిస్తున్న సైఫాబాద్ పోలీసులు

**హైదరాబాద్, జూన్ 3(మనసులో మాట ):** తెలంగాణ రాష్ట్ర డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయం వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ భూమి సమస్యకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన ఓ దంపతులు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దంపతులు పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ గేటు వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దంపతుల చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను లాక్కొని వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తర్వాత దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి భూమి సమస్యకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా సచివాలయం వద్ద చోటుచేసుకుంటున్న పరిణామాలు అక్కడి భద్రత సిబ్బందికి తలనొప్పి తెస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు పలువురు నకిలీ అధికారులు హల్ చల్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా భార్యాభర్తలు పెట్రోల్ క్యాన తో సచివాలయం ప్రవేశ ద్వారం వద్దకు దూసుకురావడం భద్రత వైఫల్యాన్ని ఎత్తి చూపుతుంది. ఆ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తతకు దారి తీసిన ఈ ఘటనతో పోలీసులను కలవరపాటుకు గురిచేసింది.

# విలేకరి రమేష్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని మాల మహానాడు డిమాండ్

**పరిగి, జూన్ 3, (మనసులో మాట):** వికారాబాద్ జిల్లా పూడూర్ మండల కేంద్రంలో నవతెలంగాణ దళిత రిపోర్టర్ తిరుమలపూర్ రమేష్‌పై జరిగిన దాడి ఘటనపై మాల మహానాడు వికారాబాద్ జిల్లా కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. గడచిన పదిహేను ఏళ్లుగా నవతెలంగాణ రిపోర్టర్‌గా, గత ఏడాది పూడూర్ వార్డు మెంబర్‌గా పనిచేస్తున్న రమేష్‌పై గత నెల 20న రాత్రి 10:30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, అతని కుమారుడు మౌనిక రెడ్డి మరియు వారి అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆర్థిక విషయమై గొడవకు దిగి, గ్రామంలోని పెద్దల సమక్షంలోనే రమేష్‌ను బూతులు తిడుతూ, దాడి చేస్తూ ప్రాణహాని కలిగించేలా బెదిరించారని ఆరోపించారు. రమేష్ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతోనే దాడి చేశారని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుల్తాన్ పూర్ వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దాడి నుంచి తప్పించుకున్న బాధితుడు అదే రాత్రి మన్నెగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, ఆ తర్వాత కూడా నిందితులు రమేష్ ఇంటికి వెళ్లి అతని భార్యాపిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తూ, రవికాంత్ రెడ్డి ఇంటి తలుపులు తన్నుతూ బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పోలీసు వారు ఈ ఘటనలో కేవలం 'పెట్టి కేసు' నమోదు చేసి నిందితులను వదిలిపెట్టడం పట్ల మాల మహానాడు జిల్లా కమిటీ అసహనం వ్యక్తం చేసింది. బాధితుడి కుటుంబం కోరినట్లుగా నిందితులపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని మండల, జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# మహావీర్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

- అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్
- ఐదు నెలల శిశువు మృతిపై విచారణ



**వికారాబాద్, జూన్ 3, (మనసులో మాట):** జూన్ 1, 2026న మహావీర్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఐదు నెలల మౌనిక అనే పాప మృతి చెందగా, ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలు మరియు జిల్లా కలెక్టరుకు ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాప మృతికి గల కారణాలను తెలుసుకోవడం కోసం అడిషనల్ కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో అడిషనల్ కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర పాల్గొన్నారు. ఆసుపత్రిలోని పీడియాట్రిక్ వార్డును సందర్శించిన అడిషనల్ కలెక్టర్, పాపకు చికిత్స అందించిన వైద్యులను మరియు యాజమాన్యాన్ని పలు విషయాలపై ప్రశ్నించారు. అనంతరం పాపకు సంబంధించిన పేషంట్ కేస్ షీట్ మరియు ఇతర రికార్డులను ఆయన పరిశీలించారు.

# పూసల సంఘ భవన స్థలం ఏర్పాటుకు కృషి చేస్తాను

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసిన సంఘ సభ్యులు**

**సానుకూలంగా స్పందించిన జగిత్యాల ఎమ్మెల్యే**



**జగిత్యాల టౌన్, జూన్ 3, (మనసులో మాట):** జగిత్యాల జిల్లా పూసల సంఘం సభ్యులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా మరియు పట్టణ పరిధిలో పూసల సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సభ్యుల అభ్యర్థనపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం ఏర్పాటు విషయంలో తాను తప్పకుండా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పస్నీర్ సతీష్, పట్టణ అధ్యక్షులు ముద్రకొల్ల శ్యామ్, ప్రధాన కార్యదర్శి మద్దినేని మురళి, కోశాధికారి మల్లి రాము మరియు ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వాచ్ స్ట్రాప్స్‌తో స్కిన్ అలర్జీ వచ్చే ప్రమాదం

**అలర్జీకి కారణం నికెల్ లోహం: హెచ్చరించిన డా. సాయి సింధు**

**నివారణ మార్గాలను సూచించిన వైద్యురాలు**



**శంకర్‌పల్లి, జూన్ 3, (మనసులో మాట):** నిత్యం మనం ధరించే వాచ్‌లలోని స్ట్రాప్స్, బెల్ట్ బకిల్స్‌లో ఉండే 'నికెల్' అనే లోహం వల్ల చర్మ అలర్జీలు వచ్చే అవకాశం ఉందని ప్రముఖ స్కిన్ డాక్టర్ సాయి సింధు హెచ్చరించారు. ఈ అలర్జీ వెంటనే కనిపించదని, వాచ్‌ను నెలల తరబడి ధరించడం వల్ల క్రమంగా దద్దుర్లు వంటి సమస్యలు తలెత్తుతాయని ఆమె వివరించారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు - సూచనలు:**

ఈ అలర్జీ ఒకసారి వస్తే పూర్తిగా తగ్గడం కష్టమని, కాబట్టి సిలికాన్ స్ట్రాప్స్ లేదా నికెల్ లేని లోహాలతో చేసిన వాచ్‌లను ధరించడం ద్వారా చర్మం తిరిగి సాధారణ స్థితికి వస్తుందని డాక్టర్ సూచించారు. ఒకవేళ వాచ్ వల్ల అలర్జీ సమస్యతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే, వెంటనే శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు, రామంతపురం శివారులో ఉన్న "సాన్వ్ స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్" ఆసుపత్రిని సంప్రదించాలని ఆమె కోరారు. ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 8337000777 నంబర్‌కు కాల్ చేయవచ్చని డా. సాయి సింధు పేర్కొన్నారు.

# నల్లగొండలో జింకల కలకలం

**ఒకటి మృతి, మరొకటి పరార్:**



**నల్లగొండ,జూన్ 03,(మనసులో మాట):** నల్లగొండ జిల్లా కేంద్రంలో బుధవారం జింకల సంచారం కలకలం రేపింది. మునుగోడు అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి జనావాసాల్లోకి వచ్చినట్లు భావిస్తున్న రెండు జింకలు జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ ఎదురుగా ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయ పరిసరాల్లో కనిపించాయి.స్థానికులు గమనించడంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో భయాందోళనకు గురైన జింకలు పరుగులు తీయగా, ఒక జింక తీవ్ర గాయాలతో షాక్‌కు గురైంది. మరో జింక అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయింది.గాయపడిన జింకకు అటవీ శాఖ అధికారులు అత్యవసర చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ, అది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం జింక మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.పోస్టుమార్టం అనంతరం జింక కళేబరాన్ని అటవీ శాఖ నిబంధనల ప్రకారం ఖననం చేయనున్నట్లు వెల్లడించారు. మృతి చెందిన జింకకు సంబంధించిన పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవీందర్ గౌడ్, రేంజ్ అధికారి వీరేంద్ర బాబు, వన్యప్రాణుల సంరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ క్రికెట్ లీగ్‌కు గిరిజన యువకుడు

**బాదావత్ శ్రీ చంద్ నాయక్ ఎంపిక**





**కొమరం భీమ్ ఆసిఫాబాద్ (మనసులో మాట):**మండలంలోని మారుమూల బాబాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు బాదావత్ శ్రీ చంద్ నాయక్ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అండర్-16 క్రికెట్ క్రీడాకారులు హైదరాబాద్‌లోని సెంచూరియన్ మైదానంలో నిర్వహించిన మూడు రోజుల సెలక్షన్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ చంద్ నాయక్ నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపికయ్యారు. శ్రీ చంద్ నాయక్, బాదావత్ శివప్రసాద్ - రజిత దంపతుల చిన్న కుమారుడు. ఆయన సాధించిన ఈ ఘనతతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ చంద్ నాయక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు ఆకాంక్షించారు.

# ఆసిఫాబాద్‌లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

- హెల్మెట్ ధరించిన వారిని "బెస్ట్ సిటిజన్స్"గా అభినందించిన ఎస్పీ



**ఆసిఫాబాద్, జూన్ 3, (మనసులో మాట):** రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, జిల్లా ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ పర్యటన కంచుకోట, గాంధీ చౌక్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మరియు పైకాజీ నగర్ మీదుగా మెయిన్ రోడ్డు వరకు సాగింది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని ఎస్పీ సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం మరియు కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారిని ఎస్పీ అభినందిస్తూ, వారిని "బెస్ట్ సిటిజన్స్ ఇన్ ఆసిఫాబాద్"గా కొనియాడారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాల పాటింపు ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, టౌన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఇతర ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ ధ్వంద్వ వైఖరిపై స్పష్టత ఇవ్వాలి

**ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు**

**హైదరాబాద్, జూన్ 3 (మనసులో మాట):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల భారతీయ జనతా పార్టీ ప్రదర్శిస్తున్న పరస్పర విరుద్ధ వైఖరి ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోంది అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు పేర్కొన్నారు. ఒకవైపు హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని "ఛోటే భాయ్" అని సంబోధిస్తూ, "హమ్మే జుడ్ జావో" అంటూ తమ పార్టీలో చేరాలని బహిరంగంగా ఆహ్వానిస్తుండగా, మరోవైపు బీజేపీ జాతీయ నాయకత్వం రేవంత్ రెడ్డిని అవినీతిపరుడిగా అభివర్ణించడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఏటీఎంలా ఉపయోగించుకుంటోందని, రేవంత్ రెడ్డి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్న సమయంలో, అదే బీజేపీ అత్యున్నత నాయకత్వం ఆయనతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడం వెనుక అసలు రాజకీయ అర్థం ఏమిటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీపై ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీజేపీ వ్యవహరిస్తున్న తీరు చూస్తే, బయటకు ప్రతిపక్ష రాజకీయాలు చేస్తూ, తెరవెనుక మాత్రం కాంగ్రెస్‌తో కుమ్మక్కై రాజకీయ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నారనే అనుమానాలు బలపడుతున్నాయని డాక్టర్ శ్రవణ్ దాసోజు పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు చేస్తున్న నాయకుడినే రేపు తమ పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారా? లేక నిజంగానే ఆయనపై ఉన్న ఆరోపణలను నమ్ముతున్నారా? అనే అంశంపై బీజేపీ స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బీజేపీ దృష్టిలో అవినీతి కాంగ్రెస్ ముఖ్యమంత్రా? లేక బీజేపీలో చేరాల్సిందిగా బహిరంగంగా ఆహ్వానిస్తున్న కోవర్ట్ మిత్రుడా? అనే ప్రశ్నకు దేశ ప్రజలు, తెలంగాణ సమాజం సమాధానం కోరుతున్నాయని డాక్టర్ శ్రవణ్ దాసోజు పేర్కొన్నారు.

# కన్నీటి కుటుంబాలకు హరీష్ రావు చేయూత

**జన్మదిన వేళ నాలుగు నిరుపేద కుటుంబాలకు రూ. 4 లక్షల ఆర్థిక భరోసా**



**గజ్వేల్, జూన్ 3, (మనసులో మాట):** రాజకీయాల్లో కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని భావించే మాజీ మంత్రి హరీష్ రావు, తన జన్మదినాన్ని పురస్కరించుకుని నాలుగు బాధిత బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఆర్థిక సహాయం: కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాలుగు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున, మొత్తం రూ. 4 లక్షల విలువైన పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేశారు. కోమటిబండ గ్రామ పార్టీ అధ్యక్షుడు శేకు భాస్కర్ కుటుంబం (రోడ్డు ప్రమాదం). తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మర్రికింది సుమన్ కుటుంబం (గుండెపోటు) మాజీ ఎంపీటీసీ బొడ్డు ప్రవీణ్ కుటుంబం (కిడ్నీ వ్యాధి) కాశిరెడ్డిపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు బండారి ఎల్లయ్య కుటుంబం (గుండెపోటు). కార్యక్రమ నిర్వహణ: గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా బాధిత కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు నింపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని నాయకులు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతని, హరీష్ రావు చూపుతున్న మానవతా దృక్పథం ఆదర్శనీయమని వారు కొనియాడారు. కేక్ కటింగ్‌లతో కాకుండా సేవా కార్యక్రమాలతో జన్మదినాన్ని నిర్వహించడం ద్వారా హరీష్ రావు మానవత్వానికి ప్రతీకగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు.

# తెలంగాణ విత్తన రంగ అనుభవం నైజీరియా యువతకు ఉపయోగపడాలి

- తెలంగాణలో శిక్షణ పొందిన టరాబా రాష్ట్ర యువతకు సర్టిఫికెట్ల ప్రదానం
- వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ - టరాబా రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం
- శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌లో అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం

మంత్రి వివేక్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జూన్ 3(మనసులో మాట):** తెలంగాణ విత్తన రంగ అనుభవం నైజీరియా యువతకు ఉపయోగపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ)లో నిర్వహించిన "అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం" బుధవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి మరో మంత్రి వివేక్ తో కలిసి మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఆ అనుభవాన్ని నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతతో పంచుకోవడం సంతోషకరమన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తెలిపారు. టరాబా రాష్ట్ర ప్రభుత్వం తమ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కల్పించేందుకు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టరాబా రాష్ట్రంతో వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ, టరాబా రాష్ట్రాల మధ్య "సిస్టర్ స్టేట్" భాగస్వామ్యానికి సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని, ఇది ఇరు ప్రాంతాల మధ్య పరస్పర అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఈ రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని మంత్రి వివరించారు. టరాబా రాష్ట్ర యువత ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను తమ ప్రాంత అభివృద్ధికి వినియోగించి వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, నైజీరియాలోని టరాబా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బు కెఫాస్, టరాబా సీడ్స్ లిమిటెడ్, ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రతినిధులు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

**నారాయణపేట, జూన్ 3, (మనసులో మాట):** తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి జూన్ 4న నారాయణపేట జిల్లాలో జరగనున్న పర్యటన నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.

## బందోబస్తు వివరాలు:

ముఖ్యమంత్రి మక్తల్ మరియు కాట్రేవుపల్లిలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించనున్నారు. ఈ పర్యటన కోసం నారాయణపేటతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, మరియు నల్గొండ జిల్లాల నుండి మొత్తం 600 మంది పోలీసులను నియమించారు. ఈ బందోబస్తులో 1 అదనపు ఎస్పీ, 7 డీఎస్పీలు, 19 సీఐలు, 52 ఎస్సైలు, 71 ఏఎస్సైలు మరియు 400 మంది కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, హోం గార్డులు పాల్గొంటున్నారు.

## భద్రతా చర్యలు:

పర్యటన భద్రతను 11 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ఇన్‌చార్జ్‌లను నియమించారు. హెలిప్యాడ్ నుండి కాన్వాయ్ మార్గం వరకు రోడ్ ఓపెనింగ్ పార్టీలు, పెట్రోలింగ్ టీములు, ట్రాఫిక్ డైవర్షన్ సిబ్బంది, బాంబ్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలను మోహరించారు.





అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి తాగునీరు, భోజన మరియు వసతి సౌకర్యాలను కల్పించారు. ఈ బ్రీఫింగ్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు ఎన్. లింగయ్య, నాగేష్, ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే కాలే యాదయ్య



**శంకర్‌పల్లి, జూన్ 3,(మనసులో మాట.):** శంకర్‌పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల కింద 75 మంది లబ్ధిదారులకు రూ. 75,08,700 విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద 47 మంది లబ్ధిదారులకు రూ. 20,18,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# జమ్మి ఆకులపై సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ చరిత్ర

## యువ రచయిత వినయ్ కుమార్ వినూత్న కళాఖండం

**కొమరం భీం ఆసిఫాబాద్, జూన్ 3, మనసులో మాట):** జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, యువ రచయిత మరియు విద్యార్థి దుర్గం వినయ్ కుమార్ వినూత్నంగా తన కృతజ్ఞతను చాటుకున్నారు. కరీంనగర్‌లోని శ్రీ వశిష్ట బి.ఎడ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న వినయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర వృక్షమైన జమ్మి చెట్టు ఆకులపై ముఖ్యమంత్రి రాజకీయ ప్రస్థానం, ప్రజా సేవా కార్యక్రమాలు మరియు నాయకత్వ విశేషాలను లిఖించారు.

## వినయ్ కుమార్ ప్రత్యేకత:

ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు నాయకత్వ చరిత్రను కొత్త తరానికి చేరవేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వినూత్న రచన స్థానిక ప్రజలు, విద్యార్థులు మరియు సాహిత్యాభిమానుల నుండి విశేష ప్రశంసలను అందుకుంటోంది. గతంలో రూపొందించిన సూక్ష్మ కళాఖండాలు దుర్గం వినయ్ కుమార్ గతంలో కూడా అద్భుతమైన సూక్ష్మ కళాఖండాలను రూపొందించి గుర్తింపు పొందారు: నువ్వు గింజలపై జాతీయగీతం. తంగేడు ఆకులపై 'తెలంగాణ'. 6500 అగ్గిపుల్లలపై అంబేద్కర్ ఆశయాలు. చింతాకులపై హనుమాన్ చాలిసా. సబ్బుబిళ్లపై తెలంగాణ చిత్రపటం మరియు చాక్‌పీసులతో కళారూపాలు. పెన్సిల్ ములికిపై తెలంగాణ అక్షరాలు. నవధాన్యాలపై ప్రభుత్వ పథకాలు మరియు బియ్యపు గింజలతో మహాత్మా గాంధీ చిత్రం. సూక్ష్మ కళ ద్వారా చరిత్ర, సాహిత్యం, సంస్కృతి మరియు సామాజిక సందేశాలను ప్రజలకు చేరవేయడమే తన లక్ష్యమని, ఈ కళాఖండాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని వినయ్ కుమార్ పేర్కొన్నారు.

# యువతా మేలుకో... భవిష్యత్తును కాపాడుకో

## సామాజిక వేత్త మారం శ్రీనివాస్ ఆవేదన

**మిర్యాలగూడ, జూన్ 3, (మనసులో మాట):** నేటి సమాజంలో యువత మరియు చిన్న పిల్లల్లో వస్తున్న మార్పుల పట్ల సామాజిక వేత్త మారం శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులు ఒక తరాన్ని సమాధి చేస్తున్నాయని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రుల బాధ్యత: చిన్న పిల్లలు ఏడ్చినప్పుడల్లా ఫోన్ చేతిలో పెట్టి, వారిని గేమ్స్ మరియు రీల్స్‌కు బానిసలుగా మారుస్తున్నారని, తద్వారా పసి మనసులను తల్లిదండ్రులే చెడగొడుతున్నారని ఆయన పేర్కొన్నారు. యువతలో పెరిగిన వ్యసనాలు: పాన్ షాపులు, సిగరెట్ డబ్బాలు మరియు మద్యం దుకాణాల వద్ద 15 నుండి 20 ఏళ్ల వయసు గల కుర్రాళ్లు ఎక్కువగా కనిపిస్తున్నారని, ఇది ఆందోళనకరమని తెలిపారు. వ్యసనాల కారణంగా 40-50 ఏళ్ల వయసుకే యువత షుగర్, బీపీ, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలతో రోడ్డున పడుతున్నారని, ప్రస్తుతం రోడ్లపై కనిపిస్తున్న 80% శ్రద్ధాంజలి ఫ్లెక్సీలు 25 నుండి 35 ఏళ్ల యువతవేనని ఆయన వాపోయారు.

### మారం శ్రీనివాస్ విజ్ఞప్తి:

తల్లిదండ్రులకు: పిల్లలకు 16 ఏళ్ల వయసు వచ్చే వరకు స్మార్ట్‌ఫోన్ ఇవ్వకండి, వారి కోసం సమయాన్ని కేటాయించండి. యువతకు: తాత్కాలిక 'కిక్' కోసం కుటుంబాన్ని రోడ్డున పడేయకండి, జీవితం మీ చేతుల్లోనే ఉందని గుర్తుంచుకోండి. ప్రభుత్వాలకు: పాఠశాలల్లో వ్యసనాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ దుస్థితికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు మరియు యువత అందరూ బాధ్యత వహించాలని, రాబోయే తరాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శంకర్‌పల్లిలో పార్క్ అభివృద్ధి పనులను ప్రారంభించిన

## మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్

**శంకర్‌పల్లి, జూన్ 3, (మనసులో మాట):** శంకర్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. పనుల ప్రారంభం: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, గాయత్రీ నగర్ కాలనీలో రోడ్డు మరియు పార్కు అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. సన్మాన కార్యక్రమం: ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ తరపున ఫిన్లాండ్‌కు వెళ్లిన కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు బాలాజీని మున్సిపల్ చైర్మన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు గిరిజ చంద్రశేఖర్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



# రహదారి భద్రత కోసం పీఎంయూ

- నగరంలో ఏర్పాటుకు సూత్రప్రాయ నిర్ణయం
- అన్ని విభాగాల మధ్య సమన్వయం కోసమే ఇది
- ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన నగర కొత్వాల్




**హైదరాబాద్, జూన్ 3(మనసులో మాట):** రాజధానిలో రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం, పర్యవేక్షణ, అనుసంధానం కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేయాని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాలు, వాటిలో మరణాలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై నగర కొత్వాల్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో జరిగిన ఈ సమావేశంలో ట్రాఫిక్ చీఫ్ డి.జోయెల్ డేవిస్, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక సైతం పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే పీఎంయూపై నిర్ణయం తీసుకున్నారు. నగరంలోని రోడ్లు, జాతీయ రహదారుల వారీగా ప్రమాదాల గణాంకాలు, ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లు, బ్లైండ్‌స్పాట్లు, పాదచారుల ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, హిట్ అండ్ రన్ ఘటనలు, బాధితులకు అందిస్తున్న పరిహారం తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. గత ప్రమాదాల ఆధారంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి చేపట్టాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. సజ్జనార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో సంబంధిత శాఖలన్నీ జవాబుదారీతనం, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు, ఫలితాలుగా మారాలని అన్నారు. నగరంలో తగిన రోడ్డు సూచికలు, రహదారి గుర్తులు, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుతో పాటు ఆక్రమణల తొలగింపు చేపట్టాలని సూచించారు. అక్రమ రహదారి దాటివేతలను నిరోధించేందుకు సెంట్రల్ మీడియన్లు, డివైడర్ల ఎత్తు పెంచి గార్డ్ రైలింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వీధి దీపాల ఏర్పాటు, స్పీడ్‌కంట్రోల్ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, శాస్త్రీయంగా యూ-టర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌ల రూపకల్పన, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, లేన్ డిసిప్లేన్ అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రధాన బ్లాక్ స్పాట్స్, బ్లైండ్ స్పాట్లు ఉన్న ప్రాంతాలపై జోయల్‌డేవిస్ వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం, బస్ షెల్టర్ల తొలగింపు లేదా స్థాన మార్పు, బస్ బేల నియంత్రణ తదితర చర్యలను ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, మరణాలను నివారించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంబంధిత శాఖలకు అప్పగించిన పనులపై నిర్దిష్ట గడువులోగా యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించార. ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలు, ప్రవర్తనా నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ అందించాలని సమావేశంలో సూచించారు. ఆర్టీసీ బస్సులతో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ నియంత్రణకు ఉద్యమిద్దాం



- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ హెచ్చరిక

**మిర్యాలగూడ, జూన్ 3, మనసులో మాట):** మిర్యాలగూడలో ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నాయని బీసీ యువజన, విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. దీనిపై ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు వ్యతిరేకంగా బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అధిక ఫీజుల వసూళ్లు: ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు మరియు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆరోపించారు. తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులు: చదువు కోసం తల్లిదండ్రులు తమ భూములు, బంగారం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అత్యధిక వడ్డీలకు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో మాఫియా: విద్యను వ్యాపారంగా మార్చి, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో దోపిడీ చేస్తున్న విద్యాసంస్థల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమ హెచ్చరిక: ఈ దోపిడీని అరికట్టకుంటే ప్రజాప్రతినిధుల మరియు విద్యాశాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని, బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అశోక్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు కొర్రపిడిత సురేష్, పట్టేటి రమేష్, శంకర్, ఉపేందర్, గంగాధర్, రాంబాబు, మనీ తదితరులు పాల్గొన్నారు.